

ప్రభుత్వ పాఠశాలలో వసతులు మెరుగు

ఇల్లంతకుంట, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలో వసతులు మెరుగయ్యాయని మాజీ ఎంపీపీ వుట్కూరి వెంకటరమణారెడ్డి అన్నారు. మండలంలోని కందికట్కూరులోని ప్రాథమిక పాఠశాలలో శనివారం వ్యక్తిగత పరిచయం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల అవసరాలను ప్రభుత్వం గుర్తించిందన్నారు. పాఠశాలకు మాజీ సర్పంచ్ ముత్యం అమర్‌గౌడ్ రూ.20వేల విలువైన మైక్‌సెట్‌ను వితరణ చేయగా సన్మానించారు. ప్రధానోపాధ్యాయుడు బద్దం రవీందర్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు ముత్యం అమర్‌గౌడ్, బిగుళ్ళ వని తతిరుపతి తదితరులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

ఆలయాల్లో కార్తీక దీపోత్సవం

ఎల్లారెడ్డిపేట, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంతోపాటు బొప్పాపూర్, గొల్లపల్లి, అల్మాస్‌పూర్, రాజన్నపేట, బండలింగంపల్లి, నారాయణపూర్ తదితర గ్రామాల్లోని ఆలయాల్లో కార్తీక మాస చివరి శనివారం పురస్కరించుకుని రాత్రి దీపోత్సవ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. మహిళలు భక్తిశ్రద్ధల నడుమ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం దీపాలను వెలిగించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యుల, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

బీసీఎఫ్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా భూమేష్

సిరిసిల్ల టౌన్ నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర వెనకబడిన కులాల సమైక్య (బీసీఎఫ్) వర్కింగ్ ప్రెసిడెంట్‌గా జిల్లాకు చెందిన న్యాయవాది పిట్టల భూమేష్ ఎన్నికయ్యారు. హైదరాబాదులోని సోమాజిగూడలో శనివారం సమైక్య ఏర్పాటైనట్లు పేర్కొన్నారు.

అంటరానితనాన్ని రూపుమాపాలి

వీర్నపల్లి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : మారుమూల పల్లెల్లో అంటరానితనాన్ని రూపుమాపాలని ఎస్సై ఎల్లాగౌడ్, మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సంతోష్ అన్నారు. వీర్నపల్లి మండల కేంద్రంలో పౌర హక్కుల దినోత్సవాన్ని శనివారం నిర్వహించారు. పౌర హక్కులకు భంగం కలిగించవద్దన్నారు.

అన్నదాతలకు వరప్రదాయిని

- నిమ్మపల్లి ప్రాజెక్టుతో భూములు సస్యశ్యామలం
- రూ.16 లక్షలతో ప్రాజెక్ట్ నిర్మాణం
- కాళేశ్వరం 9వ ప్యాకేజీలో ప్రాజెక్ట్‌కు కాలువ నిర్మాణం
- రూ.7 కోట్లతో పనులు

(ఆంధ్రజ్యోతి సిరిసిల్ల)

జిల్లాలోని కోనరావుపేట మండలం నిమ్మపల్లి మూలవాగు ప్రాజెక్టు ఈ ప్రాంత అన్నదాతలకు వర ప్రదాయినిగా మారింది. ఎర్రజెండాలు, ఉద్యమాలు, రక్తపు మరకలు గుర్తుకొచ్చే నిమ్మపల్లిలో అందమైన ప్రాజెక్టు ఉందని జిల్లా ప్రజలకు చాలా తక్కువ తెలుసు. వర్షాకాలంలోనే కాక మామూలు రోజుల్లో కూడా కొద్ది నీళ్లతోనైనా కళకళలాడుతుంది. కోనరావుపేట మండలం నిమ్మపల్లితోపాటు మూలవాగు పొడవునా గ్రామాలకు సాగునీరు అందుతుంది. మూలవాగు ప్రాజెక్టు కోసం రైతులు 1952 నుంచి పోరాటం చేసి 1973లో తమ కలను నెరవేర్చుకున్నారు.

ప్రాజెక్టు నిర్మాణానికి ఊతం ఇచ్చిన జ్ఞాపకాలను నిమ్మపల్లికి చెందిన రైతులు ఆంధ్రజ్యోతితో పంచుకున్నారు.

మూడు గుట్టల మధ్య మూలవాగుపై ప్రాజెక్ట్


జిల్లాలో ఒకనాడు మారుమూల కల్లోలిత ప్రాంతంగా ముద్రపడిన కోనరావుపేట మండలం నిమ్మపల్లి గ్రామంలో ప్రకృతి అందించిన మూడు



ప్రాజెక్ట్ కింద పచ్చని పొలాలు

గుట్టల మధ్య మూలవాగుపై కట్ట నిర్మించుకుంటే కరువుపోతుందని రైతులు భావించారు. ఒకప్పుడు వర్షం పడితేనే పంటలు వేసుకునే పరిస్థితి నుంచి బయట పడాలని కలలుకన్నారు. ఈ పరిస్థితుల్లో నిమ్మపల్లి గ్రామంలో మామూలు రోజుల్లో పది ఎకరాలకు మూలవాగులో పారే నీటిని ఆధారం చేసుకొని వ్యవసాయం చేస్తూ కాలం గడిపే వాళ్లు. 1952లో తొలిసారిగా అసెంబ్లీ ఎన్నికలు వచ్చాయి. అప్పుడు అందరిలో ఒకటే ఆలోచన మూలవాగు వద్ద ప్రాజెక్టు నిర్మించుకొని నీటిని నిల్వ చేసుకోవాలని భావించారు. మూలవాగు వద్ద పోతారం అనే చిన్న గ్రామం ఉండేది. ఆ గ్రామం నుంచి సహకార రుణాలు తీసుకొని వీరప్ప కుంట వరకు కాలువలు తవ్వుకొని నీళ్ల నింపుకోవడంతో కొంత ఆదారమైంది. 1957లో ఎన్నికల్లో మూలవాగు ప్రాజెక్టు నిర్మించాలని అప్పుడు వచ్చిన నాయకులకు నిమ్మపల్లి, కొండాపూర్, వట్టిమల్ల రైతులు డిమాండ్ చేశారు.

మిగతా 8వ పేజీలో..



1973లో ప్రాజెక్ట్ నిర్మాణ పనుల్లో రైతులు

నేటి నుంచి ప్రజాపాలన విజయోత్సవాలు

- కలెక్టర్ సందీప్ కుమార్ ఝా



సిరిసిల్ల కలెక్టరేట్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన విజయోత్సవాలను రాజన్న సిరిసిల్ల జిల్లా వ్యాప్తంగా ఆదివారం నుంచి ఈ నెల 9వ తేదీ వరకు పండుగ వాతావరణంలో నిర్వహించాలని కలెక్టర్ సందీప్ కుమార్‌ఝా కోరారు. కలెక్టరేట్‌లో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. ఆదివారం విద్యా శాఖ ఆధ్వర్యంలో యంగ్ ఇండియా రెసిడెన్షియల్ పాఠశాలల రెండోదశ నిర్మాణాల శంకుస్థాపన, పాఠశాల విద్యార్థులకు స్వీట్ల పంపిణీ, వ్యాసరచన పోటీలు, సీఎం కప్ పేరిట క్రీడలు వంటి కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

అంకితభావంతో విధులు నిర్వహించాలి

- ఎస్పీ అఖిల్ మహాజన్



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ అఖిల్ మహాజన్

సిరిసిల్ల క్రైం, నవంబరు 30(ఆంధ్రజ్యోతి):అంకిత భావంతో విధులు నిర్వహించాలని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. జిల్లాకు చేరుకున్న 125 మంది నూతన సివిల్, అర్మ్‌డ్, రిజర్వ్ కానిస్టేబుళ్లతో జిల్లా పోలీసు కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాలులో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రమశిక్షణతో విధులు నిర్వహిస్తూ మంచిపేరు తీసుకురావాలన్నారు. పోలీస్‌శాఖ అనుసరిస్తున్న సాంకేతిక పరిజ్ఞానం అందిపుచ్చుకోవాలన్నారు. శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉన్నపుడే ఎలాంటి సవాళ్లనైనా ఎదుర్కోవచ్చన్నారు. తొమ్మిది నెలల శిక్షణలో నేర్చుకున్న నూతన చట్టాలపై నిరంతరం పఠనం చేస్తూ అన్ని చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాలను పాటిస్తూ తమకు కేటాయించిన విధులను సక్రమంగా నిర్వర్తించాలన్నారు. విధి నిర్వహణలో అలసత్వం చూపితే శాఖా పరమైన చర్యలు ఉంటాయన్నారు. విలేజ్ పోలిసింగ్‌లో కేటాయించిన గ్రామాలపై పట్టు సాధించాలన్నారు. పోలీస్‌శాఖ ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఫంక్షనల్ వర్టికల్స్‌పై పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. అదనపు ఎస్పీ చంద్రయ్య, ఆర్ఐ రమేశ్, మధుకర్, ఆర్ఎస్ఐ శ్రవణ్‌యాదవ్, కమ్యూనికేషన్ సీఐ శ్రీలత పాల్గొన్నారు.



స్వామివారి దర్శనానికి బారులుదీరిన భక్తులు

రాజన్న ఆలయంలో భక్తుల రద్దీ

- కార్తీక దీపాలు వెలిగించిన భక్తులు

7



పల్లె దవాఖానాను ప్రారంభిస్తున్న విప్ ఆది శ్రీనివాస్

గురుకులాలపై బీఆర్ఎస్ కపట ప్రేమ

- విప్ ఆది శ్రీనివాస్

8

నీటి సరఫరా, పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి



సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళచక్రపాణి

- సిరిసిల్ల మున్సిపల్ కౌన్సిల్ తీర్మానం

సిరిసిల్ల, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల మున్సిపల్ పరిధిలో నీటి సరఫరా, పారిశుధ్య నిర్వహణపై కౌన్సిల్ ప్రత్యేక దృష్టి సారించింది. ఐదు పనులు చేపట్టడానికి రూ.4.50 లక్షలు మంజూరు చేశారు. శనివారం మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళాచక్రపాణి అధ్యక్ష తన సిరిస్లిల మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం నిర్వహించారు. సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని వైకుంఠధామాల్లో రూ. 101కి దహన సంస్కారాలు చేసే విధంగా కౌన్సిల్ గతంలో అమల్లోకి తెచ్చింది. తాజాగా పాడె కట్టెలు ఏర్పాటు చేసుకోవడానికి రూ.2 వేల వరకు ఖర్చవుతున్న క్రమంలో రూ.లక్షతో స్టీల్ మెటల్ పాడెలను తయారు చేయించి ఉచితంగా ప్రజలకు అందించడానికి తీర్మానం చేసింది. వివిధ వార్డుల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణం కోసం రూ .11.50 లక్షలు మంజూరు చేసింది. కౌన్సిల్‌లో వివిధ అంశాలను చర్చించి పది అంశాలపై పొందుపర్చిన ఎజెండాను కౌన్సిల్ ఏకగ్రీవంగా ఆమోదించింది. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ లావణ్య, వైస్ చైర్మన్ మంచె శ్రీనివాస్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

తుదిదశకు అభివృద్ధి పనులు



మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ మాధవి

వేములవాడ, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : ఇరవై కోట్ల రూపాయల టీయూఎఫ్ఐడీసీ నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులు తుది దశకు చేరుకున్నాయని వేములవాడ మున్సిపల్ చైర్‌పర్సన్ రామతీర్థపు మాధవి అన్నారు. వేములవాడ మున్సిపల్ పురపాలక సంఘం పాలకవర్గం సాధారణ సమావేశం చైర్‌పర్సన్ మాధవి అధ్యక్షతన శనివారం నిర్వహించారు. ఎజెండా అంశాలకు సంబంధించి చర్చ సందర్భంగా రామతీర్థపు మాధవి మాట్లాడుతూ పట్టణంలో 20 కోట్ల రూపాయలతో చేపట్టిన అభివృద్ధి పనులు చివరి దశకు వచ్చాయని తెలి పారు. 3వ వార్డు కౌన్సిలర్ నిమ్మశెట్టి విజయ్ మాట్లాడుతూ విలీన గ్రామాల్లో పాత నిర్మా ణాల అనుమతులకు పట్టణంలో మాదిరిగా పన్ను విధిస్తున్నారని దీంతో ప్రజలపై భారం పడుతోందని అన్నారు. 1994 సంవత్సరం నుంచి డాక్యుమెంట్ ఉన్నవారికి మాత్రమే అనుమతుల విషయంలో పన్ను విధిస్తున్నామని పట్టణ ప్రణాళిక విభాగం అధికారి అన్సార్ సమాధానం ఇచ్చారు. 27వ వార్డు కౌన్సిలర్ గోలి మహేశ్ మాట్లాడుతూ మూడు కోట్ల రూపాయలతో నిర్మించిన సమీకృత మార్కె ట్ భవనం ప్రస్తుతం మందు బాబులకు అడ్డాగా మారిందని, దీనిని ప్రజలకు ఉపయో గపడే విధంగా వినియోగంలోకి తీసుకు వచ్చేందుకు ప్రయత్నించాలని, లేనిపక్షంలో ఏదైనా ప్రభుత్వ శాఖకు కేటాయించేందుకు తీర్మానించాలన్నారు. 10వ వార్డు కౌన్సిలర్ సిరిగిరి రామచందర్ మాటాడుతూ పట్టణంలోని

మిగత 8వ పేజీలో

కాంగ్రెస్ ప్రభుత్వంలో పండుగలా వ్యవసాయం

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



సీఎం ప్రసంగాన్ని వీక్షిస్తున్న విప్ ఆది శ్రీనివాస్, కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

వేములవాడ రూరల్, నవంబరు 30, (ఆంధ్రజ్యోతి): వ్యవసాయాన్ని పండుగలా చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. వేములవాడ రూరల్ మండలం హన్మాజిపేట రైతువేదికలో శనివారం నిర్వహించిన రైతు పండుగ కార్యక్రమానికి కలెక్టర్ సందీప్ కుమార్ ఝాతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా మహబూబ్‌నగర్ జిల్లా నుంచి రైతులను ఉద్దేశించి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేసిన ప్రసంగాన్ని వీడియో ద్వారా వీక్షించారు. అనంతరం విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయ మన్నారు. రైతును రాజు చేయడమే లక్ష్యంగా, వ్యవసాయాన్ని పండుగ చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తోందన్నారు. ఏకకాలంలో రైతులకు రుణమాఫీ చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనన్నారు. రైతులకు రూ.21వేల కోట్ల రుణమాఫీ చేసి కాంగ్రెస్ ప్రభుత్వం చరిత్ర సృష్టించిందన్నారు. రైతులకు అందుబాటులో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటుచేసి మద్దతు ధరకు ధాన్యాన్ని సేకరించిందని, రెండు రోజుల్లోనే రైతుల ఖాతాల్లో డబ్బులు జమచేస్తున్నామని అన్నారు. సన్నరకం ధాన్యం సాగు చేసిన రైతులకు అదనంగా క్వింటాల్‌కు రూ.500 అందిస్తున్నట్లు చెప్పారు. వేములవాడ ఆర్డీవో రాజేశ్వర్, జిల్లా వ్యవసాయశాఖ అధికారి అబ్జల్ బేగం, మార్కెట్ కమిటీ చైర్మన్ రొండి రాజు, వైస్ చైర్మన్ కనికరపురాజు, ఎంపీడీవో శ్రీనివాస్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వకులాభరణం శ్రీనివాస్, మాజీ ఎంపీపీ వెంకటేశం పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిపేట: ఎల్లారెడ్డిపేట మండలం బొప్పాపూర్ గ్రామంలోని రైతు వేదికలో రైతు పండుగ సంబురాలను శనివారం ఘనంగా నిర్వహించారు. తిమ్మాపూర్ ప్యాక్స్ కార్యాలయంలో వైస్ చైర్మన్ కృష్ణమూర్తి సమావేశాన్ని నిర్వహించి రైతులకు మంజూరైన రుణమాఫీ, ధాన్యం కొనుగోళ్లను వివరించారు.మండల ప్రత్యేక అధికారి అఫ్జల్‌బేగం, ఎంపీడీవో సత్తయ్య, వ్యవసాయ శాఖ అధికారి కవిత పాల్గొన్నారు.

ఇల్లంతకుంట: మండల కేంద్రంలోని రైతు వేదికలో రైతు పండుగ సంబరాలు నిర్వహించారు. వ్యవసాయ అధికారి సురేష్ రెడ్డి ఉన్నారు

వీర్నపల్లి: వీర్నపల్లి మండల కేంద్రంలోని రైతు పండుగ సంబరాలు నిర్వహించారు.

చందుర్తి: చందుర్తి మండల కేంద్రంలోని రైతు వేదికను ఆరటితో ముస్తాబు చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రసంగాన్ని వీక్షించారు. మండల వ్యవసాయ అధికారి దుర్గరాజు, మాజీ జడ్పీటీసీ నాగం కుమార్ పాల్గొన్నారు.

రుద్రంగి: రుద్రంగి మండల కేంద్రంలోని రైతు వేదికలో రైతు పండగను నిర్వహిం చారు. మార్కెట్ కమిటీ చైర్మన్ చెలుకల తిరుపతి, ఏవో ప్రియదర్శిని, ఏఈవో జ్యోతి పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు చెల్లించాలి



విప్ ఆదిశ్రీనివాస్‌కు వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

సిరిసిల్ల రూరల్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): వివిధ శాఖల్లో ప్రభుత్వ ఉద్యోగులుగా, ఉపాధ్యాయులుగా పని చేస్తూ పదవీ విరమణ పొందిన వారి పెండింగ్ బిల్లులను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేయాలని పదవీ విరమణ పొందిన ఉద్యోగులు, ఉపాధ్యాయ సంఘం జిల్లా కన్వీనర్ మల్లారపు పురుషోత్తం కోరారు. సిరిసిల్లలో శనివారం ప్రభుత్వ విప్ అది శ్రీనివాస్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్చి 2024 నుంచి పదవీ విరమణ పొందిన ఉద్యోగ, ఉపాధ్యాయులకు పెండింగ్ బిల్లులతో పాటు గ్రాట్యూటీ, కమిటేషన్, జీపీఎఫ్, ఫైనల్ పేమేంట్, సంపాదిత సెలవు నగదు విడుదల చేసే విధంగా చూడాలని కోరారు. కార్యక్రమంలో పదవీ విరమణ పొందిన ఉద్యోగ, ఉపాధ్యాయులు ద్యావనపెల్లి పరమేష్, జూపెల్లి ప్రకాస్‌రావు, తాళ్లపల్లి అంజయ్య, విజయలు పాల్గొన్నారు.

అర్హులకు డబుల్ బెడ్‌రూం ఇళ్లు పంపిణీ చేయాలి

సిరిసిల్ల టౌన్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) జిల్లా వ్యాప్తంగా ఉన్న డబుల్ బెడ్‌రూం ఇళ్లలో కొన్ని ఇప్పటికీ ఖాళీగా ఉన్నాయని, ప్రభుత్వం వెంటనే అర్హులైన పేదలకు పంపిణీ చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు అన్నారు. శనివారం సిరిసిల్ల పట్టణం కార్మిక భవనంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గత ప్రభుత్వం నాణ్యత ప్రమాణాలు పాటించకుండా డబుల్ బెడ్‌రూం ఇళ్ల ను నిర్మించదని ఆరోపించారు. గతంలో సిరిసిల్లలోని డబుల్ బెడ్‌రూం ఇళ్ల ఎంపిక, పంపిణీలో కొందరు కౌన్సిలర్లు అవకతవకలకు పాల్పడ్డారని ఆరోపించారు. అనర్హులను తొలగించి అర్హులకు డబుల్ బెడ్‌రూంలు కేటాయించాలన్నారు. ఈ సమావేశంలో నాయకులు పంతం రవి, మీసం లక్ష్మన్, అజ్జ వేణు పాల్గొన్నారు.

మనోధైర్యమే మందు



- జిల్లాలో ఈ ఏడాది 80 మందికి హెచ్ఐవీ
- హెచ్ఐవీ నిరోధంలో సత్ఫలితాలు
- నేడు ప్రపంచ ఎయిడ్స్ నివారణ దినం

(ఆంధ్రజ్యోతి, సిరిసిల్ల)

హెచ్ఐవీ బాధితులకు మనోధైర్యమే మందుగా పని చేస్తోంది. ఆరోగ్య నియమాలు పాటిస్తూ, మందులు వాడితే జీవిత కాలాన్ని పొడిగించుకోవచ్చు. ఒకప్పుడు మరణమే ఖాయంగా ఉన్న హెచ్ఐవీ ఇప్పుడు సాధారణ జీవితం గడపడానికి అవకాశాలు ఏర్పడ్డాయి. జిల్లాలో హెచ్ఐవీ కేసులు తగ్గుముఖం పడుతు న్నాయి. 2021-22లో 8063 మందికి హెచ్ఐవీ పరీక్షలు చేయగా 85 మందికి, 2022-23లో 9011 మందికి పరీక్షలు చేయగా 86 మందికి, 2023-24 సంవత్సరానికి సంబంధించి 9902 మందికి పరీక్షలు చేయగా 80 మందికి పాజిటివ్ వచ్చింది. పద్నాలుగేళ్లలో జిల్లాలో కేసులు తగ్గుతున్నా ఏటా కేసులు వస్తూనే ఉన్నాయి. ఆదివారం ఎయిడ్స్ నివారణ దినం సందర్భంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

చికిత్స పొందుతున్నావారు 2,035 మంది

జిల్లాలో ఎయిడ్స్ కంట్రోల్ కేంద్రంలో ఇప్పటి వరకు 14 ఏళ్లలో 125361 మంది పురుషులు, మహిళలతోపాటు, గర్భిణులకు పరీక్షలు నిర్వహించారు. ప్రస్తుతం 2035 మందికి పాజిటివ్(హెచ్ఐవీ)తో చికిత్స పొందుతున్నారు.ఈ ఏడాది సాధారణ వ్యక్తులు 5503 మందికి పరీక్షలు చేయగా 76 మందికి, 4399 మంది గర్భిణుల్లో నలుగురికి పాజిటివ్ వచ్చింది.

నిశబ్దాన్ని ఛేదించాలి

హెచ్ఐవీ సోకిందని నిశబ్దంగా ఉండడం కంటే ఏఆర్‌టీ కేంద్రాన్ని సంప్రదించి మందులు వాడాలి. హెచ్ఐవీ నివారించ లేకపోయినా జీవిత కాలాన్ని పొడిగించుకునే అవకాశం ఉంటుంది. హెచ్ఐవీ సోకిన వారికి కౌన్సెలింగ్ ఉపయోగపడుతుంది. హెచ్ఐవీ బాధితుడు రోగ నిరోధక శక్తిని పెంచుకోవడానికి పౌష్టికాహారమైన పాలు, కోడిగుడ్లు, తాజా కూరగాయలు, పండ్లు తీసుకునే విధంగా అవగాహన కల్పించాలి. మద్యపానం, ధూమపానం, జర్దా, పాన్, మొదలైనవి ఎంత నష్టం కలిగిస్తాయో వివరించాలి.

మందుల వినియోగంపై అవగాహన

- కాంపెల్లి గంగాధర్, సిరిసిల్ల లింక్ ఏఆర్‌టీ ఇన్‌చార్జి



సిరిసిల్ల లింక్ ఏఆర్‌టీ నుంచి ప్రతినెలా 545 మంది మందులు తీసుకెళ్తున్నారు. మొదట ఆరు నెలలు కరీంనగర్ నోడల్ కేంద్రంలో మందులు వాడుతారు. తరు వాత సిరిసిల్లలో తీసుకుంటారు. మందుల వినియోగంపై హెచ్ఐవీ బాధితుల్లో అవగాహన పెరిగింది.

బ్యాంకు అధికారుల వేధింపులు

- ఇంటి నుంచి వెళ్లిపోయిన బాధితుడు

ఎల్లారెడ్డిపేట, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఇంటి నిర్మాణం కోసం ఓ ప్రైవేటు బ్యాంకులో తీసుకున్న రుణాన్ని చెల్లించాలని బ్యాంకు అధికారులు వేధింపులు తట్టుకోలేక ఇంటి యజమాని మజీద్ ఇంటి నుంచి వెళ్లిపోయిన సంఘటన ఎల్లారెడ్డిపేటలో శనివారం జరిగింది. తన భర్త కనిపించడం లేదని భార్య సల్మా కన్నీళ్లు పెట్టుకుంది. ఆమె తెలిపిన మేరకు.. గ్రామంలోని మజీద్ ఇంటి నిర్మాణం కోసం ఐదేళ్ల కిందట సిరిసిల్ల పట్టణంలోని ఓ ప్రైవేటు బ్యాంకులో ఐదు లక్షల రుణం తీసుకున్నాడు. వాయిదా పద్ధతిలో చెల్లించేందుకు అంగీకరించాడు. ప్రతి నెల పద్ధతిలో డబ్బులు చెల్లిస్తున్నాడు. ఇటీవల మజీద్ అనారోగ్యానికి గురవడంతో నెల వారి డబ్బులు చెల్లించేందుకు ఆలస్యమైంది. దాంతో బ్యాంకు అధికారులు గడువు ముగిసిందని పేర్కొంటూ నిత్యం మజీద్ ఇంటికి చేరుకుని చెల్లించాలని ఒత్తిడి చేశారు. వారి వేధింపులు భరించలేని తన భర్త మజీద్ తమకు చెప్పపెట్టకుండా బయటకు వెళ్లి తిరిగి రాలేదని బాధితురాలు సల్మా పేర్కొంది. ఘటనపై స్థానిక ఎస్‌ఐ రమాకాంత్‌ను వివరణ కోరగా తమకెవరూ ఫిర్యాదు చేయలేదని పేర్కొన్నారు.

ఆర్టీసీ బస్సును ఢీకొట్టిన లారీ

మానకొండూర్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లలితాపూర్ బస్టాండ్ వద్ద శనివారం ఆర్టీసీ బస్సును లారీ ఢీకొట్టింది. కరీంనగర్ నుంచి జమ్మికుంట వైపు వెళుతున్న ఆర్టీసీ బస్సు, లారీ లలితాపూర్ బస్టాండ్ మూల మలుపు వద్ద ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ సంఘటనలో ఎవరికీ ప్రమాదం జరుగలేదు.



ఓదెలలో సాగు చేస్తున్న డ్రాగన్ పండ్ల తోట



విక్రయానికి సిద్ధంగా ఉన్న డ్రాగన్ ఫ్రూట్స్

పండ్ల తోటల సాగుపై ఆసక్తి

- డ్రాగన్ ఫ్రూట్ సాగు చేస్తున్న సింగరేణి రిటైర్డ్ కార్మికుడు
- వరికంటే లాభదాయకం కావడంతో మరికొందరి దృష్టి

ఓదెల, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : ఓదెల గ్రామానికి చెందిన చింతం లక్ష్మయ్య సింగరేణి కార్మికునిగా పనిచేసి ఉద్యోగ నాలుగేళ్ల క్రితం విరమణ పొందాడు. ఓదెల శివారులో తనకున్న ఎకరం భూమిలో డ్రాగన్ ఫ్రూట్ తోటను సాగు చేశాడు. రసాయనిక పద్ధతుల్లో కాకుండా సేంద్రియ పద్ధతిలో పండ్ల తోటను సాగు చేశాడు. మొదట రూ.5 లక్షల పెట్టుబడితో ప్రణాళికలు రూపొందించిన లక్ష్మయ్య సిద్దిపేట నుంచి ఒక్కోటి రూ.50 చొప్పున డ్రాగన్ ఫ్రూట్ మొక్కలు తెప్పించి సాగు చేశాడు. పెట్టిన ఏడాది నుంచే దిగుబడి ప్రారంభమైందని, ఎకరానికి రూ.40 వేల వరకు లాభం వస్తుందని లక్ష్మయ్య పేర్కొన్నాడు. ఏటా జూన్ నుంచి డిసెంబరు వరకు పండ్లను కోసం సమీపంలోని వారసంతలకు తీసుకెళ్లి విక్రయిస్తుంటానని లక్ష్మయ్య తెలిపాడు. ఓదెలతో పాటు మరికొన్ని గ్రామాల్లో రైతులు డ్రాగన్ పండ్ల తోటను పెంచేందుకు సిద్ధమవుతున్నారు. వరి పంటకంటే అధిక లాభం వస్తుండడంతో పలువురు రైతులు పండ్ల తోటలవైపు దృష్టిని సారిస్తున్నారు.

● ఇష్టంతో కష్టపడుతున్నా..

- చింతం లక్ష్మయ్య, రైతు, ఓదెల

సింగరేణి కార్మికునిగా పనిచేసే విరమణ పొందిన తర్వాత కాలక్షేపం చేయలేదు. ముందు నుంచే వ్యవసాయం అంటే చాలా ఇష్టం. అందుకే ఇష్టంతో డ్రాగన్ పండ్ల తోటను పెంచేందుకు సిద్ధపడ్డాను. దీంతో అధిక లాభాలను పొందుతున్న



పత్తి, వరి పంటలు సాగు చేసే బదులు పండ్ల తోటలను సాగు చేస్తే ఆర్థికంగా నష్టాలకు గురికారనే ఉద్దేశంతో డ్రాగన్ పండ్ల మొక్కలను తెప్పించి సాగుచేశాను. ఇతర పంటలకంటే రెండింతలుగా లాభాలు ఉంటున్నాయి. ప్రభుత్వం సబ్సిడీ ద్వారా డ్రాగన్ మొక్కలను మిగతా రైతులకు అందజేస్తే గ్రామాల్లో మరికొందరు సాగు చేసే అవకాశాలున్నాయి.

హాస్టల్ విద్యార్థులను పట్టించుకోని ప్రభుత్వం

- మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్
- సైనిక్ స్కూల్ పరిశీలనకు వెళ్తుండగా అదుపులోకి తీసుకున్న పోలీసులు

చొప్పదండి/రామడుగు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): సంక్షేమ హాస్టళ్లలోని విద్యార్థులు అస్వస్థతకు గురవుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ అన్నారు. శనివారం చొప్పదండి మండలంలోని రుక్మాపూర్ సైనిక్‌స్కూల్ పరిశీలనకు వెళ్తున్న రవిశంకర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. గురుకుల బాటలో భాగంగా ఆయన సైనిక్ స్కూలు సందర్శనకు వెళ్తున్న క్రమంలో రుక్మాపూర్‌లో పోలీసులు అడ్డుకొని అరెస్టు చేసి రామడుగు పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. విషయం తెలుసుకున్న బీఆర్‌ఎస్ నాయకులు పోలీస్‌స్టేషన్‌కు చేరుకొని ప్రభుత్వానికి, పోలీసులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సంద ర్భంగా రవిశంకర్ మాట్లాడుతూ బీఆర్‌ఎస్ పాలనలో విద్యార్థులకు చేయూతని చ్చేందుకు పలు సంక్షేమ హాస్టళ్ల ప్రారంభించామని చెప్పారు. ప్రస్తుత ముఖ్యమంత్రి విద్యార్థులను పట్టించుకోవడం లేదన్నారు ఇప్పటికైనా సంక్షేమ హాస్టళ్లలో సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు.



సుంకె రవిశంకర్‌ను అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

తంగళ్లపల్లి, నవంబర్ 30 (ఆంధ్రజ్యోతి): తంగళ్లపల్లి మండలం పద్మనగర్ గ్రామ శివారులోని శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. పద్మనగర్‌కు చెందిన నాగిశెట్టి ప్రసాద్(36) ఉదయం వాకింగ్‌కు వెళ్లి సైకిల్‌పై ఇంటికి తిరిగి వస్తుండగా వెనకు నుంచి గుర్తు తెలియని కారు ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. ఆటోలో జిల్లా ప్రధాన ఆసుపత్రికి తరలిస్తుండగా మృతి చెందాడు. మృతునికి భార్య మీనాక్షి ఉంది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



ప్రసాద్(ఫైల్)

ఆత్మహత్యాయత్నం చేసిన ఇద్దరి మృతి

వీణవంక, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసిన మండలంలోని బేతిగల్ గ్రామానికి చెందిన విద్యార్థి చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బేతిగల్ గ్రామానికి చెందిన వేముల సిద్ధార్థ(21) హుజూరాబాద్ మండలంలోని సింగాపూర్ గ్రామంలోని కిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ తృతీయ సంవత్సరం చదవుతున్నాడు. రెండు నెలల నుంచి కళాశాలకు సరిగా వెళ్లడం లేదని తండ్రి మందలించాడు. దీంతో మనస్తాపం చెంది ఈ నెల 27న పురుగు మందు తాగాడు. కుటుంబ సభ్యులు జమ్మికుంటలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. తండ్రి వేముల రమేశ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తోట తిరుపతి తెలిపారు.

పెద్దపల్లి మండలంలో..

పెద్దపల్లి రూరల్: మండలంలోని పెద్దకల్వల గ్రామానికి చెందిన బత్తుల శంకరయ్య(52) చికిత్స పొందుతూ మృతిచెందాడు. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బత్తుల శంకరయ్య మద్యానికి బానిసై ఈ నెల 28న తన పత్తిచేనులో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. స్థానికులు గమనించి కుటుంబ సభ్యులకు తెలుపగా పెద్దపల్లి ఆసుపత్రికి తరలించారు. అనంతరం వైద్యుల సూచన మేరకు కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శనివారం మృతిచెందాడు. మృతుడి భార్య కొమురమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పెద్దపల్లి ఎస్‌ఐ లక్ష్మణ్‌రావు తెలిపారు. శంకరయ్యకు కూతురు, కుమారుడు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ వ్యక్తి మృతి

శంకరపట్నం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): శంకరపట్నం మండలం కొత్తగట్టులో చేపల కాపలాకు వెళ్లిన ఓ వ్యక్తి ప్రమాదవశాత్తు గాయపడి చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. కొత్తగట్టు గ్రామానికి చెందిన రెడ్డి శంకర్ (39) అనే వ్యక్తి ఈ నెల 23న కులవృత్తిలో భాగంగా అదే గ్రామానికి చెందిన ఎడ్ల మల్లయ్య, రేగుల రాజయ్యతో కలిసి రాత్రి చేపలు పట్టడానికి చెరువులో వేసిన వలలకు కాపలాగా వెళ్లారు. రాత్రి అక్కడ చెరువు వద్ద ఉన్నారు. తెల్లవారుజామున బహిర్భూమికి వెళ్లిన శంకర్ ప్రమాదవశాత్తు చెరువు కట్ట పక్కన కింద పడిపోయాడు. అతడి కేకలు వేయడంతో ఎడ్ల మల్లయ్య, రేగుల రాజయ్యలు అక్కడికి వెళ్లి చూడగా అతని తలకు గాయమైంది. శంకర్‌ను ఇంటికి తీసుకెళ్లి కుటుంబ సభ్యులకు అప్పగించారు. కుటుంబ సభ్యులు హుజూరాబాద్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వైద్యుల సూచన మేరకు వరంగల్‌లోని ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. శంకర్ ప్రమాదవశాత్తు జారిపడడంతో తలకు గాయమై చికిత్స పొందుతూ మృతి చెందాడని భార్య లక్ష్మీ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

గంభీరావుపేటలో దొంగతనం

గంభీరావుపేట నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): గంభీరావుపేట మండల కేంద్రంలోని దేవరాజు, మైసిరెడ్డి ఇళ్లలో శుక్రవారం రాత్రి చోరీ జరిగింది. ఇండ్లకు తాళాలు వేసి ఈ రెండు కుటుంబాలు వేరే గ్రామానికి వెళ్లారు. రెండు ఇండ్లలో దొంగలు తాళాలు పగలగొట్టి లోనికి ప్రవేశించారు. దేవరాజ్ ఇంట్లో 10 వేలు నగదు, అర తులం బంగారం, 38 తులాల వెండి దొంగలు అపహరించారు, మైసిరెడ్డి ఇంట్లో దొంగలు తాళాలు పగలగొట్టి లోనికి ప్రవేశించినప్పటికీ ఆ ఇంట్లో ఏమీ చోరీకాలేదు. ఇదిలా ఉండగా దొంగలు తాళాలు వేసిన ఇళ్లను టార్గెట్ చేస్తూ దొంగతనానికి పాల్పడుతుండడంతో ప్రజలు భయాందోళన గురవుతున్నారు.

బైక్ అదుపుతప్పి యువకుడి మృతి

జగిత్యాలరూరల్, నవంబరు 30(ఆంధ్రజ్యోతి) జగిత్యాల రూరల్ మండలంలోని లక్ష్మీపూర్ శివారులో గల కమాన్ వద్ద ప్రమాదవశాత్తు బైక్ అదుపు తప్పి చెట్టును ఢీకొని లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన నలువాల భగత్(26) అనే యువకుడు మృతి చెందినట్లు జగిత్యాల రూరల్ ఎస్సై సధాకర్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. భగత్ రాత్రి సమయంలో తన బైక్‌పై లక్ష్మీపూర్ నుంచి జగిత్యాలలోని గాంధీనగర్ లో గల తన అత్తగారింటికి బయల్దేరారు. లక్ష్మీపూర్ కమాన్ వద్ద భగత్ ప్రయానిస్తున్న బైక్ అదుపుతప్పి చెట్టును ఢీకొనడంతో భగత్ తలకు బలమైన గాయాలై మృతిచెందినట్లు తెలిపారు.మృతుడి భార్య మధుమిత ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

సుల్తానాబాద్, నవంబరు 30 (ఆంధ్ర జ్యోతి) : రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందిన సంఘటన సుల్తానాబాద్‌లో జరిగింది. ఎలిగేడు మండలంలోని బురాహన్ మియాపేటకు చెందిన గౌరు నిరంజన్ (35) అనే యువకుడు తన భార్య పిల్లలను చూడడానికి అత్తగారి గ్రామమైన సుల్తానాబాద్ మండలంలోని గట్టేపల్లికి ద్విచక్ర వాహనం పైనుంచి వెళ్తుండగా సుల్తానాబాద్-గట్టేపల్లి రోడ్డులో ఉన్న రైల్వే వంతెన సమీపంలో శనివారం తెల్లవారుజామున బైక్ అదుపుతప్పి ప్రమాదంలో నిరంజన్ మరణించాడని పోలీసులు తెలిపారు. నిరంజన్ రోడ్డుపై పడిపోయి ఉండగా కొందరు గమనించి 108లో సుల్తానాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అయితే అప్పటికే మృతిచెందినట్లు డాక్టర్లు తెలిపారు. మృతుని భార్య సంధ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతుడు నిరంజన్ ఎలిగేడు మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్‌ఏగా పనిచేస్తాడని భార్య ఫిర్యాదులో పొర్కొంది.



నిరంజన్ (ఫైల్)

ఇంటర్నేషనల్ స్యాండ్ ఫెస్టివల్‌కు శంకర్ ఎంపిక

కరీంనగర్ కల్చరల్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఒరిస్సా రాష్ట్రంలో జనవరి 1 నుంచి 5వ తేదీ వరకు జరిగే ఇంటర్నేషనల్ సాండ్ ఫెస్టివల్‌కు పెద్దపల్లి జిల్లా పాలకుర్తి మండలం కుక్కలగూడూరు గ్రామానికి చెందిన రేవెల్లి శంకర్ ఎంపికయ్యారు. కరీంనగర్ మంకమ్మతోటలో నివాసముంటున్న శంకర్ వివిధ దేశాల నుంచి హాజరయ్యే ప్రసిద్ధ సైకత శిల్పుల సరసన వుమెన్ పవర్, ఎకోటూరిజం, క్రీడలు, కల్చరల్, ఎన్విరాన్‌మెంట్ అంశాలపై సైకత శిల్పాలను రూపొందించనున్నారు. 2022, 2023 సంవత్సరాల్లో కూడా ఇంటర్నేషనల్ సాండ్ ఫెస్టివల్‌లో పాల్గొని సైకత శిల్పాలను రూపొందించి ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలు అందుకున్నారు. ఆగస్టు 15న మంత్రి శ్రీధర్‌బాబు, కలెక్టర్ పమేలా సత్పతి చేతుల మీదుగా ప్రతిభా పురస్కారం అందుకున్నారు. కాగా ఇంటర్నేషనల్ సాండ్ ఫెస్టివల్‌కు ఎంపికైన రేవెల్లి శంకర్‌కు పలువురు అభినందిస్తున్నారు.



ఒరిస్సాలో సైకత శిల్పాలను రూపొందించిన శంకర్ (ఫైల్)

హుజూరాబాద్‌లో రాష్ట్రస్థాయి హాకీ పోటీలు



హాకీ ఆడుతున్న క్రీడాకారులు

హుజూరాబాద్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ పట్టణంలోని హైస్కూల్ మైదానంలో అండర్-14 ఎస్‌జీఎఫ్ బాలబాలికల రాష్ట్రస్థాయి హాకీ పోటీలు శనివారం రెండో రోజూ కొనసాగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జయన్న ఫౌండేషన్ వ్యవస్థాపకుడు గుడిపాటి జైపాల్‌రెడ్డి, సామాజిక కార్యకర్త వర్ధినేని రవీందర్‌రావు హాజరయ్యారు. క్రీడకారులను పరిచయం చేసుకొని పోటీలను ప్రారంభించారు. ఉమ్మడి పది జిల్లాలు రాష్ట్రస్థాయి హాకీ జట్లు పోటీపడ్డాయి. బాలికల విభాగంలో కరీంనగర్, నిజామాబాద్, రంగారెడ్డి, నల్గొండ జిల్లాల జట్లు సెమీఫైనల్‌కు చేరాయి. బాలుర విభాగంలో నిజామాబాద్, హైదరా బాద్, ఆదిలాబాద్, రంగారెడ్డి జిల్లాల జట్లు సెమీఫైనల్‌కు చేరుకున్నాయి. కార్యక్రమంలో బి శ్రీనివాస్, టి శ్రీనివాస్, మధు, పీఈటీలు రాజిరెడ్డి, వేణుగోపాల్, సారయ్య, వి రవికుమార్, భాగ్యలక్ష్మి, అనిల్, శ్రీనివాస్, రేణుక ఉన్నారు.

మహిళలపై దాడులను అరికట్టాలి

- సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి శ్రీకాంత్

ధర్మపురి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): మహిళలపై దాడులను అరికట్టాలని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి పుప్పాల శ్రీకాంత్ అన్నారు. ధర్మపురి పట్టణంలో అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) నియోజకవర్గ సమావేశం లావణ్య అధ్యక్షతన శనివారం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన శ్రీకాంత్ మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత మహిళలకు భద్రత భరోసా లేకుండా పోయిందన్నారు. మహిళలు పోరాడి అనేక చట్టాలు సాధించుకున్నప్పటికీ వాటిని అమలు చేయడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయని ఆరోపించారు. హత్యలు, అత్యాచారాలు చేసిన వారిపై కఠిన చర్యలు వెంటనే తీసుకోకుండా ఏళ్ల తరబడి కేసులు పరిష్కారం కాకుండా రాజకీయ నాయకులు అండతో బాధితులకు న్యాయం జరగడం లేదని తెలిపారు. స్త్రీల హక్కుల కోసం ఐద్వా నిర్విరామ కృషి చేస్తూ మహిళా సమస్యల పరిష్కారం కోసం నిత్యం పోరాటాలు చేస్తోందని ఆయన అన్నారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. డివిజన్ కమిటీ కన్వీనర్‌గా అద్దరి కవిత, కోకన్వీనర్లుగా లావణ్య, సరోజ, ఏడుగురు కమిటీ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సమావేశంలో సీఐటీయూ జిల్లా కో కన్వీనర్ కోమిటి చంద్రశేఖర్, రైతుసంఘం జిల్లా కార్యదర్శి గర్వంతుల రమేష్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు మల్యాల సురేష్ పాల్గొన్నారు.



సమావేశమైన ధర్మపురి నియోజకవర్గ ఐద్వా సభ్యులు

రెచ్చిపోతున్న సైబర్ నేరగాళ్లు

- డ్రగ్స్ పార్సల్, బ్యాంక్ రుణం, క్రెడిట్ కార్డు, ఉద్యోగాల పేరిట మెస్సేజ్‌లతో మోసాలు
- కమిషనరేట్‌లో 220 కేసులు, 15 మంది అరెస్టు ● 197 కేసుల్లో రూ. 1.09 కోట్లు రికవరీ

కరీంనగర్ క్రైం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): హాలో.... మీ పేరు పద్మనా.... ఎయిర్‌పోర్ట్ నుంచి కస్టమ్స్ అధికారిని మాట్లాడుతున్న... మీ పేరిట పార్సల్ వచ్చింది. అందులో డ్రగ్స్, నకిలీ పాస్‌పోర్ట్‌లున్నాయి. అంటూ ఇటీవల కరీంనగర్‌కు చెందిన ఒక మహిళకు గుర్తుతెలియన వ్యక్తి వాట్సాప్ కాల్ చేశాడు. దీంతో ఆ మహిళ భయపడిపోయింది. దీనిని ఆసరగాగా తీసుకున్న సైబర్ నేరగాడు.. మీపై సైబర్ క్రైం నమోదవుతుందని చెప్పాడు. కాన్ఫరెన్స్ ద్వారా సైబర్ క్రైం పోలీసు అధికారిని మాట్లాడుతన్నాడంటూ మరో వ్యక్తి లైన్‌లోకి వచ్చాడు. మీపై సైబర్ క్రైం నమోదైంది. డిజిటల్ అరెస్టు చేస్తున్నాం.... కేసు నుంచి బయటపడాలంటే ఈ విషయం ఎవరికి చెప్పకుండా. కొంత డబ్బులు మేము చెప్పిన బ్యాంక్ ఖాతాకు జమచేయాలి అని చెప్పాడు. భయపడిపోయిన ఆ మహిళ తన ఖాతా నుంచి రెండు విడతలుగా 21.66 లక్షల రూపాయలు ట్రాన్స్‌ఫర్ చేసింది. మరుసటి రోజు అనుమానం వచ్చిన బాధితురాలు కరీంనగర్ సైబర్‌క్రైం పోలీసులకు ఫిర్యాదు చేసింది. అప్పటికే ఆ అకౌంట్ నుంచి డబ్బులు అకౌంట్‌కు ట్రాన్స్‌ఫర్ అయినట్లు సైబర్ క్రైం పోలీసులు గుర్తించారు.చివరకు ఆ అకౌంట్ యజమానిని అరెస్టు చేశారు.

● కరీంనగర్‌లోని ఒక ప్రైవేట్ ఉద్యోగికి ఒక రోజు వాట్సప్‌కాల్ వచ్చింది. ఆ వాట్సప్‌లో పోలీసు యూనిఫాం ధరించిన అధికారి ఫొటో ఉంది. ఆ వ్యక్తి మాట్లాడుతూ హైదరాబాద్‌లో మీ కూతురు వద్ద డ్రగ్స్ పట్టుకున్నాము. సైబర్ క్రైం నమోదైంది... డిజిటల్ అరెస్టు చేస్తాం అంటూ బెదిరించాడు. గంట ముందే ఆ ఉద్యోగి తన కూతురుతో మాట్లాడాడు. అటువంటిది ఏమీ లేదని, ఆ వాట్సప్‌కాల్ ఫేక్‌గా పసిగట్టి స్పందించకుండా కాల్ కట్ చేశాడు.

● ఎన్నో రకాల మోసాలు

ఈ విధంగా సైబర్ నేరగాళ్లు అనేక రకాలుగా డ్రగ్స్ పార్సల్, న్యూడ్ వీడియోకాల్స్, ఏపీకే ఫైల్స్, ఇన్వెస్ట్‌మెంట్ ఫ్రాడ్, షేర్ మార్కెట్, పిల్లలను అరెస్టు చేస్తున్నామంటూ కాల్స్ చేస్తూ సైబర్ నేరాలకు పాల్పడుతూ కోట్లు కొల్లగొడుతున్నారు. ప్రస్తుత ఆధునిక యుగంలో శాస్త్ర, సాంకేతికంగా ఎంతో అభివృద్ధి సాధించినప్పటికీ



అదే స్థాయిలో అదే సాంకేతికతో మోసాలు చేస్తున్న నేరగాళ్లు పెరుగుతున్నారు. సైబర్ మోసగాళ్లు మొదట్లో ఏటీఎం కార్డుల పిన్ నంబర్, ఓటీపీ, కార్డులను మార్చి, ఫ్రాడ్ మెస్సేజ్, ఆన్‌లైన్ బ్యాంకింగ్ మోసాల ద్వారా డబ్బులు కొట్టేసేవారు. ఇటీవల డిజిటల్ అరెస్టు పేరుతో సైబర్ నేరగాళ్లు చెలరేగిపోతున్నారు.

● రూ. కోట్లు కోల్పోయిన బాధితులు

కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో సైబర్ నేరగాళ్లబారినపడి కోట్ల రూపాయలు పోగొట్టుకున్నారు. బాధితుల ఫిర్యాదుల మేరకు ఇప్పటి వరకు కరీంనగర్ సైబర్ క్రైం పోలీసు ఠాణాలో 220 కేసులు నమోదు అయ్యాయి. ఇందులో 197 కేసుల్లో 15 మంది నిందితులను అరెస్టు చేశారు. 1.09 కోట్ల రూపాయలు సైబర్ క్రైం పోలీసులు రికవరీ చేశారు. సైబర్ నేరగాళ్లు ఫేక్ ఖాతా(మూల్ అకౌంట్) ద్వారానే బాధితుల నుంచి డబ్బులు ట్రాన్స్‌ఫర్ చేసుకుంటూ చిక్కకుండా పోతున్నారు.

● మూల్ అకౌంట్ ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్

సైబర్ నేరగాళ్లు ముందుగా ఒక వ్యక్తి గుర్తింపు కార్డుతో ఒక బ్యాంక్ ఖాతాను తెరిపించి, ఆ వ్యక్తికి ఐదు వేల రూపాయలు ముట్టచెబుతున్నారు. తరువాత ఖాతా బుక్కు, ఏటీఎం కార్డు వెంట తీసుకువెళతారు. సైబర్ నేరాలకు తన ఖాతాను ఉపయోగిస్తున్న విషయం ఆ వ్యక్తికి తెలియదు. సైబర్ క్రైం నమోదైన తరువాత పోలీసులు విచారణ చేపట్టడంతో మొదట డబ్బులు ఏ ఖాతాకు బదిలీ అయ్యిందనే విషయాన్ని గుర్తిస్తారు. సాంకేతికపరంగా ఖాతా కలిగిన వ్యక్తిపైనే కేసు నమోదవుతుంది. ఇటువంటి అకౌంట్‌ను మూల్ అకౌంట్ అంటారు. సైబర్ నేరాలకు నేరస్థులు ఉపయోగించే బ్యాక్ ఖాతాలు మూల్ ఖాతాలే కారణమని సైబర్ క్రైం పోలీసులు చెబుతున్నారు. ఈ మూల్ ఖాతాల నుంచి డబ్బులను ఇతర సంస్థలకు బదిలీ చేసుకుంటున్నారు.

● డిజిటల్ అరెస్ట్..

వీడియో కాల్, స్కైప్, వాట్సప్ కాల్ ద్వారా అమాయకులకు సైబర్ నేరస్థులు కాల్ చేసి తాము కస్టమ్స్ అధికారులమని, నార్కోటిక్, పోలీసులు, సీబీఐ, ఈడీ, సైబర్‌క్రైం అధికారులమంటూ నకిలీ గుర్తింపు కార్డులు, నకిలీ అరెస్టు వారెంట్లు చూపెడుతూ నమ్మిస్తున్నారు. కేసుల పేరుతో భయపెట్టి డబ్బులు దండుకుంటున్నారు. పన్నుల ఎగవేత, డబ్బుల దుర్వినియోగం వంటి కారణాలను చూపెడుతూ అమాయకులను భయపెడుతున్నారు. సైబర్ నేరగాళ్లు పోలీసు అధికారులమని చెబుతూ నమ్మించేందుకు పోలీసు స్టేషన్లలా కనిపించే గదుల్లో కూర్చుని వీడియోలో కనిపించే విధంగా ఏర్పాట్లు చేస్తున్నారు. తాము విచారణలో సహకరిస్తామని, కేసులో పేరు లేకుండా చేస్తామని, కొంత డబ్బులు చెల్లించాలని నమ్మబలికి వారి బ్యాంకు ఖాతాలకు లేదా యూపీఐ ఐడీలకు డబ్బులను బదిలీ చేయించుకుంటారు.

● అవగాహన పెంచుకోవాలి

సైబర్ మోసాలపై ప్రజలు అవగాహ కలిగి పెంచుకోవాలని పోలీసులు సూచిస్తున్నారు. బ్యాంక్ ఖాతా, పిన్, ఆధార్, ఓటీపీ తదితర సమాచారాన్ని ఇతరులకు ఎట్టిపరిస్థితుల్లో చెప్పవద్దని వారంటున్నారు. నిజమైన పోలీసు, కస్టమ్స్, సీబీఐ, ఈడీ వంటి శాఖల ప్రభుత్వ అధికారులు డబ్బులు చెల్లించాలని, బ్యాంక్ ఖాతా వివరాలు అడగరనే విషయాన్ని ప్రజలు గుర్తుంచుకోవాలని సూచిస్తున్నారు. డిజిటల్ అరెస్టు అనేది ఉండదని ఇటీవల కేంద్ర ప్రభుత్వం ఓ ప్రకటన జారీ చేసింది. ప్రజలు ఈ విషయాలన్నీ గమనించాలని పోలీసులు సూచిస్తున్నారు.

చిన్నారిని చిదిమేసిన నిర్లక్ష్య డ్రైవింగ్

సుల్తానాబాద్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఓ వ్యక్తి నిర్లక్ష్యపు డ్రైవింగ్‌కు చిన్నారి తనువుచాలించింది. సుల్తానాబాద్ మండలంలోని కదంబాపూర్ గ్రామ పంచాయతీ అనుబంధ గ్రామం కాశెపల్లిలో శనివారం ఫరీదా - రాజ్ మహ్మద్ దంపతులు కూతురు ఏడాదిన్నర వయసు గల రఫీద తమ ఇంటి ఎదుట ఆడుకుంటోంది. ఈ ఇంటి ఎదురుగా ఉన్న షకీల్ అనే వ్యక్తి తన బోలెరో వాహనాన్ని స్టార్ట్ చేసి వెళ్లే క్రమంలో వాహనం వెనక వైపు ఉన్న ఏడాదిన్నర పాపను గమనించలేదు. దాంతో వాహనం పాపపై నుంచి వెళ్లడంతో పాప మృతి చెందింది. చిన్నారి తండ్రి రాజ్‌మహ్మద్ బతుకు తెరువు కోసం దుబాయ్ వెళ్లాడు. తల్లి ఫరీదా కన్నీరు మున్నీరవుతోంది. పోలీసులు ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

శ్రీపాదకాలనీలో పోలీసుల కార్డన్ సెర్చ్

మంథని, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ పరిధిలోని శ్రీపాదకాలనీలో సీఐ రాజు, ఎస్‌ఐలు రమేష్, చంద్రకుమార్, నరేష్‌ల ఆధ్వర్యంలో పోలీసులు శనివారం పోలీసులు కార్డన్ నిర్వహించారు. సరైన పత్రాలు లేని వాహనాలను గుర్తించి చాలన్ వేశారు. యువత మత్తు పదార్థాలకు, చెడు వ్యసనాలకు, సైబర్ నేరాలకు దూరంగా ఉండాలని, ఇలాంటి సమాచారాన్ని పోలీసులకు ఇవ్వాలని సీఐ రాజు సూచించారు.

రోలర్ స్కేటింగ్ పోటీలకు క్రీడాకారుల ఎంపిక



జాతీయస్థాయి రోలర్ స్కేటింగ్ పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

కరీంనగర్ స్పోర్ట్స్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): జిల్లాకు చెందిన ఇద్దరు చిన్నారులు జాతీయస్థాయి రోలర్ స్కేటింగ్ పోటీలకు ఎంపికయ్యారు. కర్ణాటక రాష్ట్రం మైసూర్‌లో ఈ నెల 5 నుంచి 10 తేదీ వరకు జరిగే 62 జాతీయస్థాయి సబ్ జూనియర్ రోలర్ స్కేటింగ్ పోటీలకు జిల్లాకు చెందిన పట్నాన శ్రీహన్సీ ఏ అమృత వర్షిణి ఎంపికయ్యారు. అక్టోబర్ 4 నుంచి 8వ తేదీ వరకు భువనగిరిలో జరిగిన రాష్ట్రస్థాయి అంతర్ జిల్లాల రోలర్ స్కేటింగ్ పోటీల్లో విశేష ప్రతిభ చాటిన శ్రీహన్సి 9-11 సంవత్సరాల వయస్సు విభాగంలో, అమృత వర్షిని 5-7 సంవత్సరాల వయస్సు విభాగంలో జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారని కోచ్ గట్టు అనిల్ కుమార్, అసిస్టెంట్ బి నరహరి తెలిపారు.

హోటల్ గదిలో డబ్బులు మాయం

కరీంనగర్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ వీపార్క్ హోటల్లో తనకు చెందిన 4.5 లక్షల రూపాయలు చోరీకి గురయ్యాయని రామడుగు మండలం గోపాల్‌రావుపేట గ్రామానికి చెందిన పూడూరు మల్లేశం శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బాధితుడు మల్లేశం 28న వీ పార్క్ హోటల్‌లో రూమ్ అద్దెకు తీసుకొని ఉన్నాడు. రూం నుంచి బయటకు వెళ్లి వచ్చేసరికి బ్యాగులోని 4.5 లక్షల రూపాయలు చోరీకి గురయ్యాయని కొత్తపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కరీంనగర్ జోన్ ఈడీగా బాధ్యతలు చేపట్టిన ఖుస్రోషాఖాన్



భగత్‌నగర్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : ఆర్టీసీ కరీంనగర్ జోన్ ఈడీగా ఖుస్రోషాఖాన్ శనివారం బాధ్యతలు చేపట్టారు. కరీంనగర్, వరంగల్, నిజామాబాద్, ఆదిలాబాద్, ఖమ్మం రీజియన్ల డైరెక్టర్‌గా బాధ్యతలు చేపట్టారు. నూతన ఈడీ ఖుస్రోషాఖాన్‌ను డిప్యూటీ రీజినల్ మేనేజర్లు కె సత్యనారాయణ, ఎస్‌భూపతిరెడ్డి, డిప్యూటీ చీఫ్ పర్సనల్ మేనేజర్ ఎ విలాస్‌రెడ్డి, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పోచయ్యలింగం, పర్సనల్ ఆఫీసర్ ఎంచంద్రయ్య, ఈడీ కార్యదర్శి యుగంధర్‌రెడ్డి, కరీంనగర్-1, 2 డిపో మేనేజర్లు విజయమాధురి, వి మల్లయ్య, కరీంనగర్ బస్‌స్టేషన్ అసిస్టెంట్ మేనేజర్ సురేష్, లా ఆఫీసర్ రజనీకృష్ణ, బస్‌స్టేషన్ మేనేజర్ అంజయ్య స్వాగతం పలికారు. వరంగల్, ఖమ్మం రీజినల్ మేనేజర్లు విజయభాను, సరిరాం, జోనల్ వర్క్‌షాప్ మేనేజర్ సుగుణాకర్ పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం జోన్ పరిధిలో స్థితిగతులపై ఈడీ ఖుస్రోషాఖాన్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు.


ముగిసిన సీపీఎం మహాసభలు

భగత్‌నగర్, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌లోని ముకుందలాల్ మిశ్రాభవన్‌లో నిర్వమిస్తున్న సీపీఎం జిల్లా మహాసభలు శనివారం ముగిసాయి. ఈ సందర్భంగా జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా కార్యదర్శిగా మిల్కూరి వాసుదేవరెడ్డి, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులుగా గీట్ల ముకుందరెడ్డి, వర్ణ వెంకటరెడ్డి, గుడికందుల సత్యం, జి బీమా సాహెబ్, జిల్లా కమిటీ సభ్యులుగా యు శ్రీనివాస్, సంపత్, ఎడ్ల రమేష్, వెల్మారెడ్డి, రాజిరెడ్డి, శీలం అశోక్, డి నరేష్ పటేల్, జి రాజేశం, కోనేటి నాగమణి, కొప్పుల శంకర్, కో-అప్షన్‌సభ్యులుగా 15 మందితో నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు రాష్ట్ర కార్యదిర్శవర్గ సభ్యులు టి జ్యోతి, రాష్ట్ర కమిటీ సభ్యులు జె వెంకటేష్ తదితరులు తెలిపారు. ఎన్నికైన సభ్యులు పార్టీ పరిష్టతకు పాటుపడాలని కోరారు.

ఆకట్టుకుంటున్న షాడో చిత్రాలు

ఇంట్లోని వృథా వస్తువులతో ప్రదర్శన

- ఇల్లంతకుంట యువకుడి ప్రతిభ
- ఆర్ట్ విభాగంలో జాతీయ పురస్కారం



ఇంట్లోని వస్తువులతో వినాయకుడి చిత్రం



అమ్మవారి చిత్రం



పాలతో గీసిన సాయిబాబా చిత్రం



చక్కెరతో గీసిన మధర్‌థెరిసా చిత్రం



పెన్నుతో గీసిన యువతి చిత్రం

ఇల్లంతకుంట, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): వృథా అనుకునే వస్తువులకు తన కళను జోడించి అబ్బురపరుస్తున్నాడు రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలకేంద్రానికి చెందిన సాన అనీల్‌కుమార్. చిన్ననాటి నుంచి సమాజంలో తనకంటూ ప్రత్యేకమైన గుర్తింపు ఉండాలనది అనిల్ అభిప్రాయం. అదే లక్ష్యం విభిన్న కళాకారుడిగా మార్చింది. తల్లిదండ్రుల, ఉపాధ్యాయుల ప్రోత్సాహంతో మొదట్లో పెన్సిల్, పెన్నులతో చిత్రాలు గీయడం ప్రారంభించాడు. అతడిని ప్రతిభను గుర్తించి పలువురు ప్రశంసించడంతో ఇంకా భిన్నంగా చేయాలని ప్రయత్నించాడు. ఇంట్లోని వస్తువులను ఒకదాని పక్కన మరొకటి చేర్చి వాటిపై వెలుతురు పడేలా చేసి షాడో (నీడ) చిత్రాలను ప్రదర్శించడం మొదలుపెట్టాడు. దీంతో సాన అనీల్ పేరు షాడో అనీల్‌గా మారింది. ఇంతేకాక పాలతో గాంధీ, చక్కెరతో మదర్‌థెరిసా, ఇసుకతో చెగువేరా చిత్రాలు వేశాడు. సుద్ద ముక్క, చీపురుపుల్లలతో పలు కళారూపాలు రూపొందించాడు. 2006లో చిత్రలేఖనం పోటీలలో ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో మొదటి స్థానం, 2008లో క్రియేటివ్ పెయింటింగ్‌లో రాష్ట్రస్థాయిలో ప్రథమ బహుమతి, 2015లో ఉత్తమ యువపురస్కార్ అందుకున్నాడు. 2015లో లండన్‌లో జరిగిన ఫిల్మ్ ఫెస్టివల్‌కు ఆన్‌లైన్ ద్వారా జరిగిన పోటీలలో 7వస్థానంలో నిలిచాడు. 2016లో అమెరికాలో జరిగిన ఆర్ట్ సెలక్షన్‌లో భాగంగా 200 డాలర్స్ ప్రైజ్‌మనీని సొంతం చేసుకున్నాడు. 2020లో విశాఖపట్టణంలో జరిగిన నార్త్‌ఢిల్లీ కల్చరల్ అకాడమీ ఆధ్వర్యంలో జాతీయ అవార్డు అందుకున్నాడు. అనీల్ రూపొందించిన షాడో ఆర్ట్‌కు ఢిల్లీలో రూ.లక్ష రెమ్యూనరేషన్ సొంతం చేసుకున్నాడు. పలువురి ప్రశంసలు అందుకుంటున్నాడు.

ప్రత్యేక గుర్తింపు

\- సాన అనిల్‌కుమార్, ఇల్లంతకుంట



విభిన్నమైన కళలతో ముందుకు పోతుండడంతో సమాజంలో ప్రత్యేకమైన గుర్తింపు లభిస్తోంది. చిన్ననాటి నుంచి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ప్రోత్సాహం అందించారు. ఇప్పటి వరకు పెన్సిల్, పెన్నులతో 150 వరకు చిత్రాలు గీసాను. నాణేలతో వివేకానందుని చిత్రం, సుద్దముక్కలు, చీపురుపుల్లలతో వివిధ కళాకృతులు రూపొందించాను. అయితే షాడో చిత్రాలతో మంచి గుర్తింపు లభించింది. భవిష్యత్‌లో మరింత రాణించడానికి నిరంతరం ప్రయత్నిస్తున్నాను.

నేడు పెద్దపల్లికి మంత్రి ఉత్తమ్ రాక

\- ఉమ్మడి జిల్లాలో ప్రాజెక్టులు, సివిల్ సప్లయ్‌పై సమీక్ష
\- సీఎం సభ ఏర్పాట్ల పరిశీలన

పెద్దపల్లి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర నీటి పారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి, ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి డిసెంబరు 1వ తేదీన పెద్దపల్లికి రానున్నారు. ఆయన మధ్యాహ్నం 12 గంటలకు తన నివాసం నుంచి బేగంపేట ఎయిర్‌పోర్టుకు చేరుకుని మధ్యాహ్నం 1:30 గంటలకు పెద్దపల్లికి రానున్నారు. 1:30 నుంచి 3 గంటల వరకు ఉమ్మడి జిల్లా పరిధిలోని మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు సంబంధిత అధికారులతో చేపట్టిన ప్రాజెక్టులు, చెక్ డ్యామ్‌ల పనులు, వాటి పరిస్థితి, కొత్తగా చేపట్టాల్సిన ప్రాజెక్టులు, రిజర్వాయర్లపై సమీక్ష చేయనున్నారు. అలాగే పౌర సరఫరాల శాఖ ద్వారా చేపట్టిన ధాన్యం కొనుగోళ్లు, డబ్బుల చెల్లింపు, రైతుల ఖాతాల్లో రూ.500 బోనస్ జమ, సీఎంఆర్, రేషన్ షాపుల నిర్వహణ, తదితర అంశాలపై సమీక్ష నిర్వహించనున్నారు. నవంబరు 19న రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడలో నిర్వహించిన సీఎం సభలో కాళేశ్వరం ప్రాజెక్టు, శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టుల నిర్మాణాల్లో భాగంగా ఇప్పటి వరకు పెండింగులో ఉన్న పలు ప్యాకేజీల పనులు, రైతులకు పూర్తి స్థాయిలో సాగు నీటిని అందించేందుకు ఉమ్మడి జిల్లాలో చేపట్టాల్సిన పనుల గురించి వారం, పది రోజుల్లో మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో సమీక్షా సమావేశం నిర్వహిస్తామని మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి ప్రకటించారు. ఆ మేరకు ఆదివారం సమావేశాన్ని పెద్దపల్లి కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో నిర్వహించనున్నారు. సమీక్ష అయిన తర్వాత కలెక్టరేట్‌కు కూతవేటు దూరంలో 4వ తేదీన నిర్వహించే సీఎం రేవంత్‌రెడ్డి బహిరంగ సభ ఏర్పాట్లను రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, రాష్ట్ర రవాణా, బీసీ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, పెద్దపల్లి, రామగుండం ఎమ్మెల్యేలు చింతకుంట విజయరమణారావు, రాజ్‌ఠాకూర్ మక్కాన్ సింగ్, పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ, ఎమ్మెల్యేలు నాయకులు పరిశీలించనున్నారు.

పెద్దపల్లిలో సీఎం సభకు అధికారుల కసరత్తు

- రూ.378 కోట్ల పనులకు శంకుస్థాపన
- 9007 మంది గ్రూపు4, అసిస్టెంట్ సివిల్ సర్జన్, సింగరేణి ఉద్యోగులకు నియామక పత్రాల పంపిణీ
- అధికారులతో సమీక్షించిన జిల్లా కలెక్టర్



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న పెద్దపల్లి కలెక్టర్ కోయ శ్రీహర్ష

పెద్దపల్లి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా డిసెంబర్ 4న పెద్దపల్లిలో నిర్వహించనున్న యువత విజయోత్సవ సభకు అధికారుల కసరత్తు చేస్తున్నారు. ఈ సందర్భంగా పెద్దపల్లి జిల్లాలో 378 కోట్ల రూపాయలతో చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులకు సీఎం శంకుస్థాపన చేయనున్నారు. 9007 మంది గ్రూప్ 4, అసిస్టెంట్ సివిల్ సర్జన్, సింగరే ణిలో ఉద్యోగాలు పొందిన వారికి నియామక పత్రాలను అందజేయనున్నారు. హైదరాబాద్‌లో చేపట్టే స్కిల్ యూనివర్శిటీలో భాగస్వామ్యం అయ్యే ఏడు ఏజెన్సీలతో ఒప్పంద పత్రాలపై సంతకం చేయనున్నారు. డిజిటల్ ఎంప్లాయ్‌మెంట్ ఎక్స్‌చేంజ్‌తో పాటు సీఎం కప్‌ను ప్రారంభించనున్నారు. మరిన్ని అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసే అవకాశాలు ఉన్నాయి. శనివారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష సంబంధిత అధికారులతో కలెక్టరేట్‌లో సమీక్షా సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి కలెక్టరేట్‌లోని హెలీప్యాడ్‌కు చేరుకుంటారని, ఇక్కడ నుంచి బహిరంగ సభ ప్రాంగణానికి చేరుకునేందుకు ప్రొటోకాల్ ప్రకారం ముఖ్యమంత్రి కాన్వాయ్ సిద్ధం చేయాలని ఆదేశించారు. జిల్లాలో రోడ్లు భవనాల శాఖ ద్వారా 266 కోట్లు, పంచాయతీ రాజ్ శాఖ ద్వారా 66 కోట్లతో రోడ్డు నిర్మాణ పనులు, 10 కోట్లు వెహికల్ సబ్ స్టేషన్ నిర్మాణ పనులు, 26 కోట్ల నర్సింగ్ కళాశాల, 10 కోట్లు శాతవాహన కళాశాల అకాడమిక్ బ్లాక్ నిర్మాణ పనుల శంకుస్థాపన ప్రారంభోత్సవ కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. సీఎం సభాస్థలి వద్ద ఏర్పాటు చేసే స్టాళ్లను ఫైనల్ చేయాలని ఆర్డీఓకు సూచించారు. సీఎం వేదికపైకి చేరుకొని జ్యోతి ప్రజ్వలన చేస్తారని, రాష్ట్ర గేయం వస్తుందని తెలిపారు. సభలో రాష్ట్ర ముఖ్య కార్యదర్శి, మంత్రుల సందేశాలు ఉంటాయని, తర్వాత ఎంపిక చేసిన 10 మంది అభ్యర్థులకు సీఎం చేతుల మీదుగా నియామక పత్రాల పంపిణీ చేయనున్నారని, డిప్యూటీ సీఎం, ముఖ్యమంత్రి సందేశాలతో కార్యక్రమం ముగుస్తుందని అన్నారు. సభావేదిక పై ఉండే వీవీఐపీలు, వీఐపీలు, ఇతర నాయకులు, ఉన్నతాధికారుల జాబితా ముందుగానే తయారు చేసి పోలీస్ శాఖకు అందజేయాలని కలెక్టర్ తెలిపారు.

సభా వేదికపై ఉన్న ప్రతి కుర్చీలో ఎవరు కూర్చునేది స్పష్టంగా తెలియజేస్తూ ఏర్పాట్లు చేయాలని అన్నారు. సభా ప్రాంగణం వద్ద అవసరమైన బారికేడ్లు ఏర్పాటు చేయాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. జిల్లాలో రుణమాఫీ, బోనస్ వచ్చిన రైతులు, మహిళా సంఘాల సభ్యులు సీఎం సభకు వచ్చేలా సమీకరణ చేయాలన్నారు. వారికి భోజనం బస్సు వద్దనే అందించాలన్నారు. సీఎం కార్యక్రమానికి విధులు నిర్వహించే సిబ్బందికి గుర్తింపు కార్డులు అందజేయాలని కలెక్టర్ పరిపాలన అధికారికి సూచించారు. సీఎం సభకు వచ్చే ప్రజలు, అభ్యర్థులు, రైతులు వివిధ వర్గాల ప్రజలకు అవసరమైన తాగునీరు, మజ్జిగ ప్యాకెట్లు సిద్ధం చేయాలని కలెక్టర్ సూచించారు. పార్కింగ్ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ఆదేశించారు.

ఆకట్టుకున్న ఒగ్గు డోలు ప్రదర్శన

- ఒడిశాలో జాతీయ నృత్య ఉత్సవాల్లో తాడిజెర్రి కళాకారలు



ప్రదర్శన ఇస్తున్న తాడిజెర్రి ఒగ్గుడోలు కళాకారులు

గంగాధర, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఒడిశాలో గంగాధర మండల తాడిజెర్రి ఒగ్గుడోలు కళాకారుల ప్రదర్శన ఆకట్టుకుంటుంది. ఒడిశాలోని భవాణి పాట్నా అంబేద్కర్ స్టేడియంలో భారత సాంస్కృతిక మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో జాతీయ 2024 గిరిజన జానపద సంప్రదాయ నృత్య మహోత్సవం నవంబరు 29 నుంచి డిసెంబరు 1 వరకు నిర్వహిస్తోంది. ఇందులో భాగాంగా గంగాధర మండలం తాడిజెర్రికి చెందిన మల్లికార్జున ఒగ్గు కళా సేవా సమితి ఆధ్వర్యంలో మహిళలు కోలాటం, పురుషుల బృందం ఒగ్గుడోలు ప్రదర్శనకు ప్రభుత్వం అవకాశం కల్పించింది.

రెండు రోజులుగా తాడిజెర్రి కళాకారులు నిర్వహిస్తున్న ప్రదర్శనలను దేశం నలుమూలల నుంచి వచ్చిన అధికారులు, కళారులు ప్రసంశిస్తున్నట్లు బృంద నాయకుడు ఏగుర్ల మహిపాల్ తెలిపారు.

అఖిల భారత బ్యాడ్మింటన్ పోటీల చాంపియన్‌గా సింధు



సింధు సాధించిన ట్రోఫీలు

కరీంనగర్ స్పోర్ట్స్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): అఖిల భారత జోనల్ స్థాయి బ్యాడ్మింటన్ పోటీల చాంపియన్‌గా జిల్లాకు చెందిన సింధు నిలిచింది. హైదరాబాద్ ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించిన ఆలిండియా జోనల్ బ్యాడ్మింటన్ పోటీల్లో సింధురెడ్డి సింగిల్స్ డబుల్ విభాగాల్లో విశేష ప్రతిభచాటి చాంపియన్‌షిప్‌ను సాధించింది. తమిళనాడు రాష్ట్రంలోని చెన్నైలో ఇటీవల నిర్వహించిన జోనల్ స్థాయి బ్యాడ్మింటన్ పోటీల్లో జిల్లాలోని విద్యానగర్‌కు చెందిన సింధూరెడ్డి నాలుగేళ్ల సుదీర్ఘ విరాం తర్వాత సింగిల్స్, డబుల్ విభాగాల్లో చాంపియన్‌షిప్ సాధించింది. సింధూరెడ్డి శంషాబాద్‌లోని ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్‌లో అసిస్టెంట్ మేనేజర్‌గా పనిచేస్తున్నారు. ఈ సందర్భంగా సింధును కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ సన్మానించారు. ఎయిర్‌పోర్టు అథారిటీ ఆఫ్ ఇండియా అసిస్టెంట్ జనరల్ మేనేజర్ గంగావత్ వెంకన్న, జిల్లా యువజన క్రీడాశాఖాధికారి శ్రీనివాస్‌గౌడ్ అభినందించారు.

ధర్మపురిలో వైభవంగా గోదావరి మహా హారతి

- కార్తీకమాసం చివరివారం ఆలయాల్లో భక్తుల రద్దీ



ధర్మపురి వద్ద గోదావరికి మహా హారతి ఇస్తున్న పీఠాధిపతి అతిథేశ్వరానంద , పొల్సాని



వేములవాడ రాజన్న ఆలయంలో కార్తీక దీపాలను వెలిగిస్తున్న భక్తులు

ధర్మపురి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి క్షేత్రంలో గోదావరి మహా హారతి కార్యక్రమాన్ని శనివారం రాత్రి వైభవంగా నిర్వహించారు. రాత్రి వేళలో అనేక మంది భక్తులు, మహిళలు, ఆర్‌ఎస్‌ఎస్, వీహెచ్‌పీ కార్యకర్తలు వెంటరాగా విశ్వహిందూ మహా సంఘ్ భారత్, శ్రీలంక అద్వైత పీఠాధిపతి అతిథేశ్వరానంద పర్వత, గోదావరి మహా హారతి ఉత్సవ సమితి వ్యవస్థాపక చైర్మన్ పోల్సాని మురళీధర్‌రావు మొదట గోదావరి నదికి పూజలు నిర్వహించారు. అనంతరం వారు గోదావరికి మహాహారతి సమర్పించారు. మహిళలు, యువతులు, విద్యార్థినులు నదిలో దీపాలను వదిలారు. కార్యక్రమంలో గోదావరి హారతి రాష్ట్ర కన్వీనర్ లింగంపెల్లి వీర గోపాల్, కో కన్వీనర్లు దామెర రాంసుధాకర్‌రావు, బలుమూరి సంతోష్‌రావు, పాపారావు, హనుమాన్ సేవ సమితి అధ్యక్షుడు సాయిరెడ్డి, జగిత్యాల జిల్లా కన్వీనర్ పిల్లి శ్రీనివాస్ పాల్గొన్నారు. ధర్మపురి క్షేత్రంలోని లక్ష్మీనరసింహస్వామి దేవాలయాన్ని విశ్వహిందూ మహా సంఘ్ భారత్, శ్రీలంక అద్వైత పీఠాధిపతి అతిథేశ్వరానంద పర్వత స్వామిజీ, గోదావరి మహా హారతి ఉత్సవ సమితి వ్యవస్థాపక చైర్మన్ పోల్సాని మురళీధర్‌రావు దంపతులు వేర్వేరుగా సందర్శించారు.

● కార్తీకమాసం చివరివారం కావడంతో శనివారం ధర్మపురి క్షేత్రంలో శ్రీ లక్ష్మీ నృసింహస్వామి, అనుబంధ ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. గోదావరి నదిలో కార్తీక స్నానాలు ఆచరించారు. నవ దంపతులు గోదావరి పౌరోహితులచే సంకల్పాది పూజలు చేయించుకున్నారు. అనేక మంది మహిళలు నదిలో కార్తీక దీపాలు వదిలారు. భక్తులు ఆలయాలకు చేరుకుని అభిషేకాది పూజలు, కుంకుమార్చన, నరసింహ హోమం, స్వామి వారల నిత్య కళ్యాణం జరిపించి పూజలు చేశారు. ఆలయం ఆవరణలో గల ఉసిరిక చెట్టు చుట్టూ ప్రదక్షిలు చేసి కార్తీక దామోదరుడిని పూజించారు. యమ ధర్మరాజు ఆలయం వద్ద గండదీపంలో నూనె పోసి భక్తి ప్రపత్తులు చాటుకున్నారు. ధర్మపురి క్షేత్రంలో 29వ రోజు శనివారం గోదావరి హారతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.

రాజన్న ఆలయంలో..

వేములవాడ కల్చరల్: కార్తీక మాసం చివరివారం కావడంతో వేములవాడ శ్రీరాజ రాజేశ్వర స్వామి వారి ఆలయానికి భక్తుల తాకిడి పెరిగింది. భక్తులు శ్రీరాజరాజేశ్వర స్వామి వారి దర్శనం కోసం క్యూలైన్‌లో బారులు తీరారు. ఆలయంలోకి చేరుకున్న భక్తులు శ్రీపార్వతి పరమేశ్వరులను దర్శించుకుని తరించారు. కార్తీక దీపాలను వెలిగించి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ ఆవరణలోని పార్కింగ్ స్థలంలో శ్రీకాళీ వారాహీ త్రిశక్తి పీఠం గురువు బ్రహ్మశ్రీ నవీన్‌శర్మ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ సభ్యులు సంకెపల్లి సుదీర్‌రెడ్డి రాజన్న ఆలయానికి రావ డంతో అధికారులు స్వాగతం పలికారు. శాతవాహన యూనివర్శిటీ వైస్ ఛాన్స్‌లర్ ప్రొఫెసర్ ఉమేష్‌కుమార్ రాజన్న దర్శనానికి వచ్చారు.

కొండగట్టులో భక్తుల రద్దీ

మల్యాల: కొండగట్టు ఆంజనేయస్వామి సన్నిధానం శనివారం భక్తులతో రద్దీగా మారింది. వేలాదిగా భక్తులు కొండపైకి తరలివచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయంలో పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం బేతాళుడి వద్ద కూడా పూజలు చేశారు. ఏఈవో అంజయ్య, పర్యవేక్షకులు హరిహరనాథ్, చంద్రశేఖర్ సిబ్బంది పర్యవేక్షించారు.

'మధ్యాహ్న భోజన విధులను ఉపాధ్యాయులకు ఇవ్వవద్దు'

సిరిసిల్ల రూరల్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో నిర్వహిస్తున్న మధ్యాహ్న భోజన తయారీలో ఉపాధ్యాయులకు విధులను నిర్వహించకుండా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవడంతో పాటు పెండింగ్ బిల్లులను చెల్లించి ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎస్‌జీటీలకు ఓటు హక్కు కల్పించాలని తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు అనిల్‌కుమార్ డిమాండ్ చేశారు. పట్టణంలోని శివనగర్ కుసుమ రామయ్య బాలుర ఉన్నత పాఠశాలలో శనివారం రాత్రి టీపీటీఎఫ్ రాజన్న సిరిసిల్ల జిల్లా శాఖ అధ్వర్యంలో టీపీటీఎఫ్ బాధ్యుల సమా వేశాన్ని నిర్వహించారు. ఈసమావేశానికి హాజరైన రాష్ట్ర అధ్యక్షుడు అనిల్‌కుమార్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన మాదిరిగా విద్యాశాఖకు సంబంధించిన అంశాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. మధ్యాహ్న భోజన విధులకు ఉపాధ్యాయు లను సస్పెండ్ చేయడాన్ని ఖండిస్తున్నా మని అన్నారు. మధ్యాహ్న భోజనానికి సంబంధించిన బిల్లులు సరిగా మంజూరు చేయకుండా సరైన వసతులు కల్పిం చకుండా కేవలం ఉపాధ్యాయులను బాధ్యు లను చేస్తూ సస్పెండ్ చేయడం సరైన విధానం కాదన్నారు. సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శినన్నబోయిన తిరుపతి, రాష్ట్ర ఉపాధ్యక్షులు పాతూరి మహేందర్‌రెడ్డి, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దుమాల రాంనాథ్‌రెడ్డి, విక్కుర్తి అంజయ్య, నాయకులు కిషన్‌రావు, పంజాల వెంకన్న, పురం వాసుదే వరావు, దబ్బెడ హన్మాండ్లు, నూగురి దేవేందర్, మందాడి శ్రీనివాసరెడ్డి, రజనిరాణీ, తిరుపతి, మైలారం తిరుపతి, చకినాల రామచంద్రం, ఎడ్ల కృష్ణ చైతన్య తదితరులు పాల్గొన్నారు.

గురుకులాలపై బీఆర్ఎస్ కపట ప్రేమ

● ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

గంభీరావుపేట, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): గురుకులాలపై బీఆర్ఎస్ కపట ప్రేమ కనబరుస్తోందని, అధికారం పోయిన ఫ్రస్టేషన్‌లో పిల్లల మరణాలపై రాజకీయం చేయడం బీఆర్ఎస్‌కే చెల్లిందని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. గంభీరావుపేట మండలం గోరంటాలలో రూ.62 లక్షలతో నిర్మించ తలపెట్టిన వంతెన పనులు, దమ్మన్నపేటలో రూ.24 లక్షలతో నిర్మించిన పల్లెదవాఖానను ప్రారంభించారు. అనంతరం సిరిసిల్ల కాంగ్రెస్ నియోజక వర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డితో కలిసి విలేకరులతో మాట్లాడారు. అధికారం పోయిన ఫ్రస్టేషన్‌లో బీఆర్ఎస్ పిల్లల మరణాలపై రాజకీయం చేస్తోందన్నారు. మరోవైపు పార్టీ కార్యకర్తలను కాపాడుకోవడానికి కేటీఆర్ ఏదీ పడితే అది మాట్లాడుతున్నా డన్నారు. తమకు కూడా అంతకంటే ఎక్కువ మాట్లాడవచ్చని, కానీ తమకు సంస్కారం ఉందని అన్నారు. గురుకులాల సమస్యను రాజకీయం చేసే కుట్రను తప్పుబట్టారు. వాంకిడి ఆశ్రమ పాఠశాలలో శైలజ అనే విద్యార్థినికి అనారోగ్యం తలెత్తగానే మంచిర్యాలకు, అక్కడి నుంచి నిమ్స్‌కు తరలించారన్నారు. హుటాహుటిన వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ వెళ్లి పరామర్శించారన్నారు. విద్యార్థిని మరణాన్ని బీఆర్ఎస్ పార్టీ రాజకీయం చేస్తోందన్నారు. బీఆర్ఎస్ హయాంలో 15 రోజుల వ్యవధిలో ఐదుగురు విద్యార్థులు మరణించిన విషయాన్ని ప్రస్తావించారు. ఆ రోజు కాంగ్రెస్ రాజకీయం చేయలేదన్నారు.

గత సర్కారు రూ.7 లక్షల కోట్లు అప్పు చేసినా..

బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రూ.7 లక్షల కోట్లు అప్పు చేసినా రేవంత్‌రెడ్డి సర్కార్ ప్రతీ నెల మొదటి వారంలోనే ఉద్యోగులకు వేతనాలను అందిస్తున్నారని ఆది శ్రీనివాస్ అన్నారు. ఎప్పటికప్పుడు గురుకులాలను సందర్శిస్తున్నట్లు చెప్పారు. గురుకులాలను అడ్డుపెట్టుకుని బీఆర్ఎస్ కుట్ర హేయమైన చర్య అన్నారు.



వీర్నపల్లిలో బీటీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేసిన ఆది శ్రీనివాస్

25 ఎకరాల్లో ఇంటర్నేషనల్ స్థాయి స్కూల్స్

ప్రతీ నియోజక వర్గంలో 25 ఎకరాల్లో ఇంటర్నేషనల్ స్థాయి స్కూల్స్ ఏర్పాటుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని, మొదటి, రెండు, మూడో దశల్లో ఇంటిగ్రేటెడ్ మాడల్ స్కూల్స్ తీసుకొచ్చేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని అన్నారు. ఇప్పటికే మొదటి దశ పనులు ప్రారంభించామన్నారు. బీఆర్ఎస్ విద్యను పెట్టుబడి దారులకు వ్యాపారంగా అప్పజెప్పిందన్నారు. అవినీతి అక్రమాలతో సంపాదించిన డబ్బును బీఆర్ఎస్ సోషల్ మీడియాలో ఉద్యోగులను పెట్టుకొని ఖర్చు చేస్తోందన్నారు. సిరిసిల్ల నియోజక వర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ చైర్మన్ నాగుల సత్యనారాయణగౌడ్, కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ స్థాయి కో ఆర్డినేటర్ కొండూరు గాంధీ, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ విజయ, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సయ్య, మండల అధ్యక్షుడు హమీద్, జిల్లా ఉపాధ్యక్షుడు కొమిరిశెట్టి తిరుపతి, బీసీ సంక్షేమ సంఘం అధికార ప్రతినిధి పర్శ హన్మండ్లు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు సంగీతం శ్రీనివాస్, గడ్డం నర్సయ్య, నాయకులు చంద్రారెడ్డి, గంగి స్వామి, ఎలుక రాజు, నర్సింలు, కూడెల్లి లక్ష్మణ్, పిట్ల వెంకటి, విఠల్, బాలరాంరెడ్డి, సంతోష్, గంగాధర్‌గౌడ్ ఉన్నారు.

అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తాం

వీర్నపల్లి: సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో మారుమూల పల్లెలు, తండాల అభివృద్ధే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తుందని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. వీర్నపల్లి మండలంలో బీటీ రోడ్ కేజీబీవీ అదనపు తరగతి గదులకు శనివారం శంకుస్థాపన చేశారు. వీర్నపల్లి మండలం మద్దిమల్ల నుంచి లొద్ది తండా, కాశి తండా వరకు బీటీ రోడ్డుకు సీఆర్ఆర్ నిధులు రూ. 1.14 కోట్లు, కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో అదనపు తరగతి గదులు, ప్రయోగశాలకు సమగ్ర శిక్ష నిధుల ద్వారా రూ. 3.25 కోట్లు కేటాయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మారుమూల అటవీ పల్లెల్లో గత ప్రభుత్వం చేయలేని పనులను కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో చేపడుతున్నామన్నారు. అనంతరం పాఠశాలలో అధ్యాపకులు సరిగా బోధిస్తున్నారా? భోజనం సరిగా పెడుతున్నారా.. అని విద్యార్థులను ప్రశ్నించారు. భోజనం బాగానే పెడుతున్నారని సమాధానం ఇచ్చారు. ఫిజిక్స్ బోధించేందుకు అధ్యాపకులను ఏర్పాటు చేయాలని విద్యార్థులు కోరారు. వేడి నీళ్లు రావడంలేదని చలికాలంలో స్నానం చేయడానికి, సరిపడ వాష్ రూంలు లేక పాఠశాల సమయంలో ఇబ్బందులు పడుతున్నామని మొరపెట్టుకున్నారు. వేడి నీళ్ల కోసం ఏర్పాట్లు చేస్తామని సమస్యలు పరిష్కరిస్తామని తెలిపారు. గ్రంథాలయ చైర్మన్ నాగుల సత్యనారాయణ గౌడ్, సెస్ చైర్మన్ చిక్కాల రామారావు, పంచాయతీ రాజ్ ఈఈ భూమేశ్వర్, సమగ్ర శిక్ష ఈఈ అనిత సింగ్‌నాథ్, మార్కెట్ కమిటీ చైర్మన్ లకావత్ రాములు నాయక్, సెస్ డైరెక్టర్ మాడుగుల మల్లేశం, జిల్లా విద్యాధికారి రమేష్ కుమార్, కేజీబీవీ జీసీడీవో పద్మజ, ఏఎంసీ వైస్ చైర్మన్ లక్ష్మణ్, తహసీల్దార్ మారుతి రెడ్డి, ఎంపీడీవో అబ్దుల్ వాజీద్, ఎంఈవో శ్రీనివాస్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బీటీ యాదవ్ పాల్గొన్నారు.

గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి పెద్దపీట

తంగళ్లపల్లి: కాంగ్రెస్ ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి పెద్దపీట వేస్తోందని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. తంగళ్లపల్లి మండలం పద్మనగర్ శివారులోని ప్రధాన రహదారి నుంచి రూ. 2 కోట్ల 25 లక్షల వ్యయంతో నిర్మిస్తున్న బీటీ రోడ్డుకు, లగిశెట్టి వృద్ధాశ్రమం వరకు రూ.60లక్షల వ్యయంతో నిర్మిస్తున్న రోడ్డు, అంకుసాపూర్-ఇందిరనగర్ మధ్య మిగిలి పోయిన వంతెన నిర్మాణ పనులకు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లడుతూ అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నట్లు చెప్పారు. సంతోషిమాత దేవాలయంలో చండీయాగంలో పాల్గొని మొక్కులు తీర్చుకోగా లగిశెట్టి శ్రీనివాస్ దంపతులు ఆది శ్రీనివాస్‌ను సన్మానించారు. కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, సిరిసిల్ల ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి జిల్లా గ్రంథాలయ చైర్మన్ నాగుల సత్యనారయణగౌడ్, మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ వెలుముల స్వరూప తిరుపతి రెడ్డి, కాంగ్రెస్ నాయకులు గడ్డం నర్సయ్య సంగీతం శ్రీనివాస్,వైద్య శివప్రసాద్, జల్గం ప్రవీణ్, పుర్మాణి లింగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అన్నదాతలకు వరప్రదాయిని

(5వ పేజీ తరువాయి)

రైతుల ఆలోచనలకు అనుగుణంగా 1967లో అప్పుడు సీపీఐ నాయకుడిగా ఉన్న సీహెచ్ రాజేశ్వర్‌రావు తనను గెలిపిస్తే ప్రాజెక్టు నిర్మాణం చేపడతానని హామీ ఇచ్చారు. ఆ ఎన్నికల్లో ఆయనను గెలిపించడంతో 1973లో రూ.16లక్షలతో ప్రాజెక్టు పనులు మొదలయ్యాయి. ప్రాజెక్టుకు మధుసూదన్‌రెడ్డి, లక్ష్మీనర్సయ్య కాంట్రాక్టర్లుగా వ్యవహరించారు. నిమ్మపల్లి రైతులు కూడా కూలీ పనులు చేశారు. కానీ 1974లో పనులు మధ్యలోనే నిలిచిపోయాయి. రైతులు ఆందోళన చెందారు. 1976లో కర్నూల్‌కు చెందిన కాంట్రాక్టర్ దామోదర్‌రెడ్డి పూర్తి చేశారు. మూడు సంవత్సరాల పాటు ప్రాజెక్టు వద్ద పనులతో కిటకిటలాడింది. మూడు గ్రామాలతోపాటు చందుర్తి, వేములవాడ వరకు మూలవాగు ద్వారా నీటి ప్రవాహం ఉంటుంది. 19 అడుగుల లోతు ఉండి ఒకప్పుడు పది ఎకరాలకు నీరు అందే మూలవాగు ఇప్పుడు ఖరీఫ్ సీజన్‌లో 2600 ఎకరాలకు, రబీలో 1900 ఎకరాలకు సాగునీరు అందిస్తోంది. ప్రాజెక్టుకు ఉన్న కుడి కాలువ నిమ్మపల్లి, కొండాపూర్, ఎడమ కాలువ నిమ్మపల్లి, వట్టిమల్ల గ్రామాలకు నీరందిస్తోంది. ప్రకృతి రమణీయతతో ఉన్న ప్రాజెక్టును చూడడానికి తెలిసిన ప్రజలు వస్తుంటారు. గతంలో అటవీ శాఖ ఒక గేస్ట్‌హౌస్‌ను నిర్మించగా నక్సలైట్లు పేల్చివేశారు. ఇప్పటికీ ప్రాజెక్టు రైతులకు వర ప్రదాయినిగా కొనసాగుతోంది.

మల్కపేట రిజర్వాయర్ నుంచి ప్రాజెక్ట్‌కు నీళ్లు

నిమ్మపల్లి మూలవాగు ప్రాజెక్ట్‌కు శాశ్వత జలకళ తీసుకురావడంతోపాటు ఆయకట్టుకు సాగునీరు అందించే దిశగా చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా కాళేశ్వరం ఎత్తిపోతల పథకం 9వ ప్యాకేజీలో నిర్మాణం పూర్తి చేసుకున్న కోనరావుపేట మండలం మల్కపేట రిజర్వాయర్ నుంచి నిమ్మపల్లి మూలవాగు ప్రాజెక్ట్‌కు నీటిని అందించేందుకు కాలువ నిర్మాణానికి నిధులు మంజూరు చేశారు. 7.50 కిలోమీటర్లు మేరకు రూ.7 కోట్లతో కాలువ నిర్మాణం చేపట్టనున్నారు. నిమ్మపల్లి ప్రాజెక్ట్ నుంచి కొండాపూర్ వరకు కాలువ నిర్మించనున్నారు. సిరిసిల్ల మిడ్ మానేరు ప్రాజెక్ట్ నుంచి ఎగువ మానేరు ప్రాజెక్ట్ వరకు 9వ ప్యాకేజీ రూ. 396 కోట్లతో పనులు చేపట్టారు. మల్కపేట వద్ద మూడు గుట్టలను అనుసంధానం చేస్తూ 6 కట్టలతో మూడు టీఎంసీల సామర్థ్యంతో రూ.504 కోట్ల వ్యయంతో ప్రాజెక్ట్ పనులు పూర్తి చేశారు. ఇందుకోసం సిరిసిల్ల మిడ్ మానేరు నుంచి ప్రాజెక్ట్ వరకు 12 కిలోమీటర్ల మేరకు టన్నెల్ నిర్మాణం పూర్తి చేశారు. మల్కపేట రిజర్వాయర్ ద్వారా ఎగువ మానేరు ప్రాజెక్ట్, బత్తుల చెరువు, సింగ సముద్రం, వరకు కాలువ నిర్మాణాలు చేపట్టారు. త్వరలోనే అందుబాటులోకి రానున్న మల్కపేట ప్రాజెక్ట్ నుంచి నిమ్మపల్లి ప్రాజెక్ట్ వరకు కాలువ నిర్మాణం ద్వారా శాశ్వత సాగునీటి సౌకర్యం రానుంది.

గ్రామస్థులందరం కలిసి కట్టుకున్నాం : చేకూట కుంటయ్య నిమ్మపల్లి



నిమ్మపల్లి ప్రాంతంనీరు లేక విలవిల్లాడేది. ఏలాగైనా ప్రాజెక్ట్ కట్టుకోవాలని అందరం ఆలోచించాం. అప్పటి ఎమ్మెల్యే రాజేశ్వర్‌రావు దృష్టికి తీసుకుపోయాం. ప్రాజెక్ట్ కట్టడానికి యంత్రాలు లేవు. గ్రామస్థులందరం పనికి వెళ్లి ప్రాజెక్ట్‌ను నిర్మించుకున్నాం. ప్రాజెక్ట్‌కు రెండు కాలువలు ఉంటాయి. ఒక కాలువ కొండ చెరువు నింపేందుకు, మరో కాలువ పొలాలకు నీరందిస్తుంది.

ప్రాజెక్ట్‌తో కరువు పోయింది : దొంతరవేని దేవయ్య, నిమ్మపల్లి



ప్రాజెక్ట్ పూర్తయిన తరువాత ఊరికి నీటి కరువు పోయింది. ఈ ప్రాజెక్ట్‌ను గతంలో కొత్తచెరువుగా పిలిచేవాళ్లం ప్రాజెక్ట్‌గా నిర్మించుకున్న తరువాత వ్యవసాయం అభివృద్ధి చెందింది. భూములకు విలువ కూడా పెరిగింది. ప్రాజెక్ట్ నీటితో కరువు మాత్రం రావడం లేదు.

ముఖ్యమంత్రి చిత్ర పటానికి క్షీరాభిషేకం

వేములవాడ రూరల్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నూకలమర్రి గ్రామానికి విద్యుత్ సబ్ స్టేషన్ మంజూరు చేసినందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ చిత్రపటాలకు కాంగ్రెస్ నాయకలు, గ్రామస్థులు శనివారం క్షీరాభిషేకం నిర్వహించారు. గ్రామంలో 2 కోట్ల 33 లక్షల 72వేల రూపాయలతో 33 కేవీసబ్ స్టేషన్ మంజూరు చేయించిన విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌కు కృతజ్ఞతలు తెలిపారు. మార్కెట్ కమిటీ చైర్మన్ రొండి రాజు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వకులాభరణం శ్రీనివాస్, మాజీ ఎంపీపీ రంగు వెంకటేశం, మాజీ ఎంపీటీసీ బొడ్డు శంకరవ్వరాములు, గ్రామ అధ్యక్షుడు పాలకూర్తి పర్శరాములు పాల్గొన్నారు.



క్షీరాభిషేకం నిర్వహిస్తున్న నాయకులు

తుదిదశకు అభివృద్ధి పనులు

(5వ పేజీ తరువాయి)

పలు వార్డులలో అవసరమైన చోట విద్యుత్ స్తంభాల ఏర్పాటుకు అంచనా వేయాలని సెస్ అధికారులను కోరిన పనులు ఎక్కడిదాకా వచ్చాయో ఇప్పటి వరకు తెలియడం లేదని అన్నారు. పలు వార్డులలో మైనర్ రిపేర్లు, ఇతర అవసరాల నిమిత్తం నిధులు కేటాయించాలని కౌన్సిలర్లు కోరారు. వార్డులలో అభివృద్ధి పనులకు ఇప్పటికే నిధులు కేటాయిస్తున్నామని చైర్ పర్సన్ మాధవి సమాధానం ఇచ్చారు. టియుఎఫ్ఐడిసి నిధులు 20 కోట్ల రూపాయలతో వేములవాడ పురపాలక సంఘం పరిధిలో మురికి కాలువలు, సిసి రహదారులు, జంక్షన్ల సుందరీకరణ అభివృద్ధి పనులు చేశామని అన్నారు. 19 అంశాలతో కూడిన ఎజెండాలోని అంశాలకు పాలకవర్గం ఈ సందర్భంగా ఆమోదం తెలిపింది. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ అన్వేశ్, వైస్ చైర్మన్ బింగి మహేశ్, కౌన్సిలర్లు సంగ హనుమవ్వ, రెండుమిద్దెల జయ, నిమ్మశెట్టి విజయ్, మారం కుమార్, నీలం కళ్యాణి, జోగిని శంకర్, కందుల శ్రీలత, సిరిగిరి రామచందర్, యాచమనేని శ్రీనివాసరావు, గడ్డమీది లావణ్య, తిరుమల్‌రెడ్డి కవితా రెడ్డి, కొండ పావని, చింతపంటి దివ్య, నరాల శేఖర్, ఇప్పపూల అజయ్, అన్నారం ఉమారాణి, ముప్పిడి సునంద, గోలి మహేశ్, కో ఆప్షన్ సభ్యులు నీరటి సువర్ణ, బాబున్, ఏశాలు నరసింహస్వామి, నర్మద, పట్టణ ప్రణాళిక విభాగం అధికారి అన్సారీ, ఆర్ఐ మురళి పాల్గొన్నారు.

9వ ప్యాకేజీ పనులపై ప్రత్యేక దృష్టి

గంభీరావుపేట, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): తొమ్మిదో ప్యాకేజీ పనులపై ప్రత్యేక దృష్టి సారించామని, వేములవాడ సభలో కేకే మహేందర్‌రెడ్డితో కలిసి సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లామని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ వెల్లడించారు. శనివారం మండలంలోని దమ్మన్నపేటలో పల్లె దావాఖాన ప్రారంభోత్సవ సందర్భంగా విద్యార్థులు తయారు చేసిన స్మాట్ వాష్ బేషన్, వంట మిత్ర ఆవిష్కరణలను ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పరిశీలించారు. విద్యార్థులను, గైడ్ టీచర్ తాడురు సంపతకుమార్‌ను అభినందించారు. అనంతరం గోరంటాల వంతెన నిర్మాణ పనులు ప్రారంభించారు. తొమ్మిదో ప్యాకేజీ పనులను పూర్తి చేస్తామని సీఎం హామీ ఇచ్చినట్లు చెప్పారు. అంతకు ముందు అంజనేయస్వామి ఆలయంలో స్వామివారిని దర్శించుకున్నారు. కాంగ్రెస్ సిరిసిల్ల నియోజక వర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ చైర్మన్ నాగుల సత్యనారాయణగౌడ్, పార్లమెంట్ నియోజక వర్గ కో ఆర్డినేటర్ కొండూరు గాంధీ, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు హమీద్, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ విజయతిరుపతి, బీసీ సంక్షేమ సంఘం నేత పర్శ హన్మండ్లు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సయ్య పాల్గొన్నారు.



విద్యార్థుల ఆవిష్కరణను పరిశీలిస్తున్న విప్ ఆది శ్రీనివాస్

ప్రేరణ స్వచ్ఛంద సంస్థకు రాష్ట్ర స్థాయి అవార్డు



అవార్డు అందుకుంటున్న సభ్యులు

సిరిసిల్ల టౌన్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : సిరిసిల్ల పట్టణానికి చెందిన ప్రేరణ స్వచ్ఛంద సంస్థ రాష్ట్ర స్థాయిలో ఉత్తమ సామాజిక సేవా అవార్డును అందుకుంది. శనివారం హైదరాబాద్‌లోని టీహబ్ వేదికగా బ్యాక్వర్డ్ క్లాసెస్ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ(బిక్కి)ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అవార్డుల మహోత్సవంలో సామాజిక సేవా విభాగంలో ఉత్తమ సామాజిక సేవా అవార్డును ఎంఎల్‌సీ మధుసూదనాచారి చేతుల మీదుగా సంస్థ సభ్యులు అందుకున్నారు. ప్రేరణ సభ్యులు అన్నారపు వేణుగోపాల్, వెల్దండి, సాయికృష్ణ, నీలి సంతోష్ అవార్డు అందుకున్నారు. ఆవార్డుల ప్రదానోత్సవంలో బిక్కి సంస్థ బాధ్యులు పరికిపండ్ల నరహరి, చేరాల వెంకటస్వామి, కిరణ్ పాల్గొన్నారు.

కన్నుల పండువగా అయ్యప్ప పడిపూజ

సిరిసిల్ల రూరల్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల పట్టణంలోని 8వ వార్డు పరిధిలోని పెద్దబోనాల శివారులో కౌన్సిలర్ కల్లూరి రాజు ఎస్టేట్‌లో శనివారం అయ్యప్ప పడిపూజ మహోత్సవాన్ని నిర్వహించారు. కల్లూరి రాజు - రేణుక దంపతులు చేపట్టిన ఎరుకల ప్రకాష్ గురుస్వామి, బల్కి రమేష్ పంతులు గురుస్వామి ప్రత్యేక పూజలు చేశారు. మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళా చక్రపాణి, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి, కౌన్సిలర్లు గడ్డం లత, దిడ్డి మాధవి, అడ్డగట్ల మాధవి, అన్నారం శ్రీనివాస్, కల్లూరి లత, వెల్దండి దేవదాస్, మాజీ కౌన్సిలర్లు దార్ల సందీప్, అర్బన్ బ్యాంక్ వైస్ చైర్మన్ అడ్డగట్ట మురళి పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లలో ఎల్లారెడ్డిపేట ముందంజ

ఎల్లారెడ్డిపేట, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోళ్లలో ఎల్లారెడ్డిపేట మండలం ముందంజలో నిలిచిందని ఏఎంసీ చైర్ పర్సన్ సబేరాబేగం అన్నారు. ఎల్లారెడ్డిపేట మండలం బొప్పాపూర్‌లోని వ్యవసాయ మార్కెటు కమిటీ కార్యాలయంలో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు పండించిన ధాన్యాన్ని సకాలంలో కొనుగోలు చేసిందన్నారు. వైస్ చైర్మన్ రాంరెడ్డి, ప్యాక్స్ చైర్మన్ కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలో ఫ్యాన్ల ధ్వంసం

సిరిసిల్ల రూరల్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల పట్టణంలోని గోపాల్‌నగర్ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం రాత్రి అకతాయిలు క్లాస్‌రూంలో ఫ్యాన్లను ధ్వంసం చేశారు. పాఠశాల ఆవరణలో మద్యం తాగారు. విద్యుత్ వైర్లు, మరుగుదొడ్లలో ఉన్నా వస్తువులను ధ్వంసం చేశారు. మధ్యాహ్న భోజన ప్లేట్లను ఎత్తుకెళ్లారు. క్లస్టర్ ప్రధానోపాధ్యాయుడు లకావత్ మోతీలాల్‌తో పాటు మండల విద్యాధికారి దూస రఘుపతికి సమాచారం అందించగా పోలీసులకు ఫిర్యాదు చేశారు.

పత్తిరైతు ఆత్మహత్య

ఇల్లంతకుంట, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): పెట్టుబడులు అధికమవడం, అనుకున్న స్థాయిలో దిగుబడి రాకపోవడంతో అప్పులు తీర్చేమార్గం కనపించక పత్తిరైతు పురుగుల మందుతాగి ఆత్మహత్య చేసుకున్నాడు. రాజన్నసిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలం జవారిపేటకు చెందిన కోమటి నాగరాజు (49)అనే రైతు తనకున్న నాలుగు ఎకరాల భూమితోపాటు మరో ఆరు ఎకరాల భూమిని కౌలుకు తీసుకొని కొద్ది సంవత్సరాలుగా పత్తిపంటను సాగు చేస్తున్నాడు. ప్రతీ సంవత్సరం నష్టం రావడానికి తోడు కుమార్తె వివాహం చేయడంతో దాదాపు రూ.15 లక్షల అప్పులయ్యాయి. దీంతో అప్పులు ఎలా తీర్చాలని నిత్యం మనోవేదనకు గురయ్యేవాడు. శనివారం వ్యవసాయ బావివద్ద పురుగుల మందుతాగాడు. అనంతరం తన కుమార్తెకు ఫోన్‌లో పురుగుల మందుతాగినట్లు చెప్పాడు. ఇల్లంతకుంట ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రాథమిక చికిత్స అనంతరం ఎల్లారెడ్డిపేటలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. బంధువుల ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీకాంత్‌గౌడ్ తెలిపారు

అసైన్డ్ భూమి రిజిస్ట్రేషన్ వ్యవహారంలో బీఆర్ఎస్ నాయకుడి అరెస్ట్

- అప్పటి సబ్‌రిజిస్ట్రార్, తహసీల్దార్, వీఆర్వోలపై కేసు

సిరిసిల్ల క్రైం, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని సర్దాపూర్ శివారులో అసైన్డ్ భూమి రెవెన్యూ అధికారుల సహాయంతో అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకున్న వ్యవహారంలో బీఆర్ఎస్ బీసీ సెల్ సిరిసిల్ల పట్టణ అధ్యక్షుడు బొల్లి రామ్మోహన్ (48)ను శనివారం అరెస్ట్ చేసినట్లు సిరిసిల్ల టౌన్ సీఐ కె.కృష్ణ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం... సిరిసిల్ల పట్టణ శివారులోని సర్దాపూర్ ప్రాంతంలో రామ్మోహన్ దాదాపు 7 ఎకరాల 30 గుంటల అసైన్డ్ భూమిని అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకున్నాడు. తప్పుడు ఇన్వర్డ్ నంబరుతో మ్యూటేషన్ చేసుకొని నాలా కన్వర్షన్ చేయించాడు. దానిలో అక్రమ వ్యాపారం చేస్తూ అక్రమంగా సంపాదిస్తూ ప్రభుత్వాన్ని మోసం చేస్తున్నాడు. ఈ మేరకు సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలోని ఈ-సెక్షన్ విభాగంలో విధులు నిర్వహిస్తున్న తహసీల్దార్ గుగ్గిళ్ల వేణు శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు మేరకు రామ్మోహన్‌ను అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పర్చగా 14 రోజుల రిమాండ్ విధించినట్లు సీఐ తెలిపారు. ఈ వ్యవహారంలో అప్పటి సిరిసిల్ల సబ్ రిజిస్ట్రార్, తహసీల్దార్, వీఆర్వోలు బొల్లి రామ్మోహన్‌తో కుమ్మక్కై అసైన్డ్ భూముల అక్రమ రిజిస్ట్రేషన్‌కు సహకరించారని, వారిపై కేసు నమోదు చేశామని సీఐ పేర్కొన్నారు. కాగా రామ్మోహన్ సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్‌కు ప్రధాన అనుచరుడిగా, ట్రాక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా, ఆటో యూనియన్ గౌరవ అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు.

ప్రభుత్వం భీములు ఇవ్వాలి

సిరిసిల్ల టౌన్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే ఆర్డర్లలో కుటీర పవర్‌లూం యజ మానులకు నేరుగా భీములు, కోములు(వెఫ్ట్)ఇవ్వాలని సిరిసిల్ల కుటీర పవర్‌లూం వస్త్ర ఉత్పత్తిదారుల సంక్షేమ సంఘం సభ్యులు కోరారు. శనివారం సిరిసిల్ల పట్టణంలోని కాంగ్రెస్ కార్యాలయంలో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ప్రభుత్వ విధానాలతో సిరిసిల్లకు వచ్చిన ప్రభుత్వ వస్త్ర ఆర్డర్లతో కొందరికే మేలు కలిగిందన్నారు. మెజారీటి శాతం ఉన్న కుటీర పవర్‌లూం యజమానులకు అన్యాయం జరిగిం దన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం నెలకొల్పిన యారన్ బ్యాంకు ద్వారా సిరిసిల్లలోని మా కుటీర పవర్‌లూం వస్త్ర ఉత్పత్తిదారులకు ఒక ప్రత్యేక కేటగిరిగా (వీకర్ సెక్షన్)గా గుర్తించాలన్నారు. సంఘం కన్వీనర్ గౌడ వాసు, కో కన్వీనర్ కొండ ప్రతాప్ పాల్గొన్నారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే రిజిస్ట్రేషన్లు రద్దు

కొడిమ్యాల, నవంబరు30(ఆంధ్రజ్యోతి) ప్రభుత్వ నిబందనలను ఉల్లంఘిస్తె ఆసుపత్రుల రిజిస్ట్రేషన్లు రద్దు చేస్తామని జిల్లా మాతా శిశు సంక్షేమ అధికారి జైపాల్‌రెడ్డి హెచ్చరించారు. శనివారం మండల కేంద్రంలోని పలు ప్రైవేటు ఆసుపత్రులను తనిఖీ చేశారు. కొడిమ్యాలలో ప్రభుత్వ నిబంధనలు ఉల్లఘించి నిర్వహిస్తున్న రెండు ఆసుపత్రులకు షోకాజ్ నోటీసులను జారీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రైవేటు ఆసుపత్రులను ప్రభుత్వ నిబంధనల ప్రకారం నిర్వహించాలన్నారు.

విద్యారంగాన్ని నిర్వీర్యం చేస్తున్న ప్రభుత్వం

సిరిసిల్ల రూరల్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): విద్యారంగాన్ని రాష్ట్ర ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోందని, ప్రజా పాలన పేరుతో విద్యార్థుల ప్రాణాలతో చెలగాటం ఆడుతోందని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మల్లారపు ప్రశాంత్ అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని, విద్యార్థుల ప్రాణాలతో చెలగాటం ఆడవద్దని శనివారం జిల్లా కేంద్రంలోని పలు పాఠశాలలను బంద్ చేశారు. ఈ సందర్భంగా ప్రశాంత్ మాట్లాడుతూ రాష్ట్రంలో వరుసగా ఫుడ్ పాయిజన్ సంఘటనలు జరుగుతున్నాయని, విద్యార్థి చనిపోయినా ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తోందని అన్నారు. ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు మంద అనిల్‌కుమార్, నాయకులు పాల్గొన్నారు.

● ప్రభుత్వ పాఠశాలలను రాష్ట్ర ప్రభుత్వం నిర్వీర్యం చేస్తుందని శనివారం సిరిసిల్ల జిల్లా కేంద్రంలో ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల బంద్ కార్యక్రమాన్ని చేపడుతుండగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మల్లారపు ప్రశాంత్, డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు గాంతుల మహేష్‌లను పోలీసులు నాయకులను అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అక్రమ అరెస్టుల పోరాటాలను ఆపలేరన్నారు.

ఇల్లంతకుంట: ప్రభుత్వ విద్యాలయాలలో సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైందని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు మంద అనీల్‌కుమార్ అన్నారు. మండలంలోని ప్రభుత్వ పాఠశాలలను శనివారం మూసివేయించారు. రాష్ట్రంలో వరుసగా జరుగుతున్న సంఘటనలపై వెంటనే విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు.

ఎల్లారెడ్డిపేట: ప్రభుత్వ పాఠశాలలో నెలకొన్న సమస్యలను పరిష్కరించడంలో సర్కారు తీరును నిరసిస్తూ వామ పక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో తలపెట్టిన రాష్ట్ర వ్యాప్త ప్రభుత్వ పాఠశాలల బంద్ శనివారం ఎల్లారెడ్డిపేట మండలంలో విజయవంతమైంది.

గంభీరావుపేట: గంభీరావుపేటలో ఎస్ఎఫ్ఐ ఇచ్చిన బంద్ విజయ వంతమైంది. ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి కళ్యాణ్‌కుమార్, నాయకులు అరుణ్, కిరణ్, విద్యార్థులు పాల్గొన్నారు.

వీర్నపల్లి: బంద్ విజయవంతమైందని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు జాలపల్లి మనోజ్ కుమార్ అన్నారు. వీర్నపల్లి మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలలను ఫుడ్ పాయిజన్ సంఘటనలకు నిరసనగా ఎస్ఎఫ్ఐ నాయకులు మూసి వేయించారు.

కోనరావుపేట: ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో తలపెట్టిన విద్యాసంస్థల బంద్ శనివారం విజయ వంతమైంది. ఈ సందర్భంగా కోనరావుపేట మండల కన్వీనర్ జశ్వంత్ మాట్లాడుతూ సంక్షేమ హాస్టళ్లు, జిల్లా పరిషత్, ప్రాథమిక పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం నాణ్యత లేని కారణంగా రాష్ట్రంలో చనిపోతున్నారన్నారు.



సిరిసిల్లలో పాఠశాలను బంద్ చేయిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

కలెక్టర్‌ను కాంగ్రెస్ కార్యకర్తగా అభివర్ణించడం సరికాదు

సిరిసిల్ల టౌన్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): కలెక్టర్‌ను కేటీఆర్ కాంగ్రెస్ కార్యకర్తగా అభివర్ణించడం ఎంతవరకు సబబని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ కార్యాలయంలో సిరిసిల్ల నియోజ కవర్గం ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆది శ్రీనివాస్ సమక్షంలో సిరిసిల్ల పాలిస్టర్ వస్త్ర ఉత్పత్తిదారుల యాజమానుల సంఘం అధ్యక్షుడు ఆడెపు భాస్కర్, ప్రధాన కార్యదర్శి అంకాలపు రవి, మాజీ అధ్యక్షులు దూడం శంకర్, గోవిందు రవి, దూస భూమయ్య, సభ్యులు, వ్యాపారులు బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను పేదలకు అందేలా చూడాలని, పార్టీ బలోపేతానికి కృషి చేయాలని అన్నారు. గతంలో తాను చెప్పినట్లుగానే రాజన్న సిరిసిల్ల జిల్లా అభివృద్ధి ఎక్కడా ఆగదన్నారు. గత ప్రభుత్వం పెట్టిన రూ. 270 కోట్ల బకాయిలను నేతన్నలకు చెల్లించామన్నారు. రూ. 50 కోట్లతో చేనేత క్లస్టర్‌గా ఉన్న వేములవాడలో నూలు డిపోను ఏర్పాటు చేస్తున్నామని, గత పాలకులకు యారన్ డిపోను ఈ ప్రాంతంలో ఏర్పాటు చేయాలన్న ఆలోచన ఎందుకు రాలేదని ప్రశ్నించారు. కేటీఆర్ నేతన్నలకు రూ. 270 కోట్లు బకాయిలు పెట్టిపోయాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేటీఆర్ అధికారం కోల్పోయిన ఫ్రస్టేషన్‌లో ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నాడని, కలెక్టర్ నుంచి ముఖ్యమంత్రి వరకు బూతులు మాట్లాడు తానంటే కాంగ్రెస్ కార్యకర్తలు ఊరుకోరని అన్నారు. నాడు జిల్లా కావాలని ఆందోళనలు చేస్తుంటే ఢిల్లీలో ఉన్న కేటీఆర్ సిరిసిల్లను జిల్లాగా చేయడం వీలు కాదని క్షమించాలని జిల్లా ప్రజలకు బహిరంగ లేఖ రాశాడన్నారు. సబ్బండ వర్గాల ప్రజలు పోరాటాలు చేస్తే జిల్లా వచ్చిందన్నారు. కేటీఆర్ తన భాషను మార్చుకోవాలని, ముఖ్యమంత్రిపై వ్యాఖ్యలు సరికాదని అన్నారు. కేకే మహేందర్ రెడ్డి మాట్లాడుతూ తాము సైతం కాంగ్రెస్‌కు అండగా ఉంటామంటూ కాంగ్రెస్ పార్టీలోకి వచ్చిన అసోసియేషన్ సభ్యులను ఆహ్వానిస్తున్నామన్నారు. గ్రంథాలయం జిల్లా అధ్యక్షుడు నాగుల సత్యనారాయణ, మార్కెట్ కమిటీ చైర్మన్ వెల్ముల స్వరూప తిరుపతిరెడ్డి, టీపీసీసీ సభ్యుడు సంగీతం శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ సిరిసిల్ల పట్టణ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాష్, ప్రధాన కార్యదర్శి వ్యాన ప్రసాద్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సూర దేవరాజు, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఆకునూరి బాలరాజు, మహిళ జిల్లా అధ్యక్షురాలు కాముని వనిత, చేనేత సెల్ జిల్లా అధ్యక్షుడు ఎల్లప్ప, పీసీసీ మాజీ కార్యదర్శి నర్సయ్య, మాజీ కౌన్సిలర్లు చంద్రకళ, అర్బన్ బ్యాంక్ మాజీ వైస్ చైర్మన్ రవీందర్, మున్నూరుకాపు సంఘం జిల్లా అధ్యక్షుడు దేవయ్య, సిరిసిల్ల పద్మశాలి సంఘం అధ్యక్షుడు వెంకట రమణ, నాయకులు వైద్య శివప్రసాద్, తిరపతిరెడ్డి, నళినీకాంత్, గౌతమ్ పాల్గొన్నారు.



భాస్కర్‌ను పార్టీలోకి ఆహ్వానిస్తున్న ప్రభుత్వ విప్